epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 148 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 1 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



## నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

8మంది మహిళా భక్తులు మృత్యువాత


బీహార్‌లోని నలంద జిల్లాలో గల శీతల మాత ఆలయంలో మంగళవారం ఉదయం జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు దుర్మరణం చెందారు.

4



# మూసీపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

- నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- 24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, మార్చి 31:** మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామని చెప్పారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని

మిగతా 2 లో

## ట్యాంక్ బండ్ శివకు ముఖ్యమంత్రి అండ

రూ. 5 లక్షల ఆర్థిక సాయం, కుమారుడికి హోం గార్డు ఉద్యోగం!



- డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలనిఆదేశం
- స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్..
- మానవత్వానికి నిదర్శనమన్న శివ కుటుంబం

2



## మార్జిన్ కోసం..

చికెన్ దుకాణాదారుల ఆందోళన

నేటి నుంచి బంద్ పాటిస్తామని ప్రకటన

3

## చల్లపల్లి ఠాణాలో పేలుడు



5



ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి

## సీఐడీ నోటీసులు

4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

2

# పగలు భగభగ.. సాయంత్రం వాన

తెలంగాణలో ఒక్కసారిగా మారిన వాతావరణం



- పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉందని సూచన
- పలు జిల్లాల్లో అకాల వర్షాలు.. 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రాబోయే 4 రోజులు ఇదే పరిస్థితి..
- ఈదురు గాలులతో వడగళ్ల వాన

2





# క్వాంటం హబ్‌గా అమరావతి

ఏప్రిల్ 14న దేశంలోనే తొలి 'ఓపెన్ క్వాంటం కంప్యూటర్' ప్రారంభం!

- 'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్‌వేర్ లక్ష్యం..
- క్వాంటం అప్లికేషన్లతో ఏపీకే తొలి ప్రయోజనాలు
- 2030 నాటికి టాప్-5 క్వాంటం కేంద్రాల్లో ఒకటిగా ఏపీ
- రౌండ్ టేబుల్ సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

5





ఇద్దరు బిడ్డలను చంపి

## ఆత్మహత్య

కూకట్‌పల్లిలో దారుణ ఘటన

2

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులను చంపి, తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# పసుపు రైతుకు భరోసా

తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం

మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

2

పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

తక్షణమే సమస్య పరిష్కరించండి

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ



2



# ట్యాంక్ బండ్ శివకు సీఎం అండ

**రూ. 5 లక్షల ఆర్థిక సాయం, కుమారుడికి హోం గార్డు ఉద్యోగం!**

**హైదరాబాద్, మార్చి 31:** హుస్సేన్ సాగర్ (ట్యాంక్ బండ్) వద్ద ఆపదలో ఉన్న వందలాది మంది ప్రాణాలను కాపాడిన సాహసి 'ట్యాంక్ బండ్ శివ'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. ఎందరికో పునర్జన్మ ప్రసాదించిన శివ.. ప్రస్తుతం ఉపాధి లేక పేదరికంలో మగ్గుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి, మంగళవారం ఆయనను పిలిపించి ప్రభుత్వం తరపున భారీ సాయాన్ని అందజేశారు. శివ కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు, ఆయన కుమారుడు వేణుమాధవ్‌కు హోం గార్డుగా నియామక పత్రాన్ని సీఎం స్వయంగా అందజేశారు. శివ దీన స్థితిని గమనించిన సీఎం రేవంత్ రెడ్డి, కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా ఆయనకు శాశ్వత నివాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శివ కుటుంబానికి తక్షణమే డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, తన జీవనోపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని శివ కోరగా, సీఎం సానుకూలంగా స్పందించి ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం చేతుల మీదుగా ఈ భారీ సాయం అందుకోవడం పట్ల ట్యాంక్ బండ్ శివ, ఆయన కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న తమను గుర్తించి అండగా నిలిచిన సీఎంకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలు కాపాడే సాహసానికి ప్రభుత్వం ఇచ్చిన ఈ గుర్తింపు పట్ల నగర ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పసుపు రైతులకు భరోసా

**మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



**హైదరాబాద్, మార్చి 31:** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు...ఈ మేరకు పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

**4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు**

**హైదరాబాద్, మార్చి 31:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు పంపింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్?పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ నగరంలో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ కేసు నంబర్ 30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారనేది కౌశిక్ రెడ్డిపై ఉన్న ఆరోపణ. ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు అడ్డంకి కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర వ్యాఖ్యలు చేశాడని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30కు విచారణకు హాజరు కావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసుల్లో స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణకు సహకరించాల్సిందిగా కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఇద్దరు బిడ్డలను చంపి ఆత్మహత్య

**హైదరాబాద్, మార్చి 31:** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులను చంపేసింది. ఆ తరువాత తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆ మహిళ తన ఇద్దరు పిల్లలు కార్తీక్ (12), కౌశిక్ (10) లతో కలిసి రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటోంది. కుటుంబ తగాదాల కారణంగా భర్త ప్రవీణ్ దూరంగా ఉంటున్నాడు. అయితే, ఇటీవలే అతను రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ.. తన ఇద్దరు కొడుకులను చంపేసింది. ఆ తరువాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. దీనిని గమనించిన స్థానికులు.. కూకట్‌పల్లి పీఎస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాలను పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఇంతటి దారుణానికి పాల్పడటానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు.

# మూసీపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసీ ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ నిర్వాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.



# పగలు భగభగ.. సాయంత్రం వాన



**హైదరాబాద్, మార్చి 31:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటిపూట ఎండలు మండిపోతుండగా, సాయంత్రం వేళ అకస్మాత్తుగా మేఘాలు కమ్ముకొని వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం భిన్నంగా కనిపిస్తోంది. సోమవారం రాష్ట్రంలోని దాదాపు 30 జిల్లాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా ఆరుట్లలో అత్యధికంగా 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లోనూ ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఎండల నేపథ్యంలో వాతావరణ శాఖ ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం గందరగోళంగా ఉంది. ఇబ్రహీంపట్నం, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, ఉప్పల్, నాగోల్ వంటి ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి 31 ఉదయం నుంచే కొమరం భీం ఆసిఫాబాద్, నిర్మల్, కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పగటిపూట కూడా చీకట్లు అలుముకున్నాయి. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, కొన్ని చోట్ల వడగళ్ల వాన పడే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు.

- ఒక్కసారిగా మారిన వాతావరణం
- పలుచోట్ల వర్షం కురిసే అవకాశం
- పలు జిల్లాల్లో అకాల వర్షాలు.. 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రాబోయే 4 రోజులు ఇదే పరిస్థితి..
- ఈదురు గాలులతో వడగళ్ల వాన

**అన్నదాతల ఆందోళన**

ఈ అకాల వర్షాలు రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న మామిడి పంట ఈదురు గాలుల వల్ల నేలపాలవుతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల తోటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో ఇదే విధమైన భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు మరియు రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

**తక్షణమే సమస్య పరిష్కరించండి**

**కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ**

**హైదరాబాద్, మార్చి 31:** హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై



నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవలం 20శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో అక్రమ విద్యుత్ ఉత్పత్తి



- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఏపీ ప్రభుత్వం..
- నీటి కష్టాలు వచ్చే ప్రమాదంపై హెచ్చరిక..
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మార్చి 31:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుండి అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనివల్ల వేసవిలో తాగునీటి కటకట ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి చేయవద్దని నిబంధనలు ఉన్నాయని.. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు చేయవద్దని ఉత్తర్వులు ఉన్నాయని గుర్తు చేశారు. తాగునీటి అవసరాల కోసం మాత్రమే ప్రాజెక్టు నీటిని వినియోగించాలని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.

**కోర్టు తీర్పులను బేఖాతరు చేస్తున్నారు**

తెలంగాణ హైకోర్టులో గతంలో దాఖలైన పిటిషన్ పైన జస్టిస్ పినాకి గోష్ ఇచ్చిన తీర్పు కూడా విద్యుత్ ఉత్పత్తికి వ్యతిరేకంగా ఉందని జూపల్లి వివరించారు. దొంగతనంగా కరెంటు తీసుకోవాల్సిన అవసరం ఏపీకి ఏముందని ప్రశ్నించారు. ధర్నా చేస్తామని హెచ్చరించడంతోనే ఏపీ ప్రభుత్వం పంపింగ్‌ను నిలిపివేసిందని వెల్లడించారు. పాలమూరు రైతాంగానికి.. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర హక్కులను కాపాడుతాం**

నీటి పంపకాల అంశం ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉందని.. 69 శాతం తెలంగాణకు.. 31 శాతం ఆంధ్రకు వాటా రావాల్సి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను ప్రభుత్వం ఖచ్చితంగా కాపాడుతుందని స్పష్టం చేశారు. అక్రమంగా నీటిని తరలిస్తే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. మంత్రి వ్యాఖ్యలతో తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# హైదరాబాద్‌లో జయలలిత ఇల్లు సీజ్!

- ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ కఠిన చర్య..
- 2017 నుండి సుమారు 83 లక్షల రూపాయల బకాయిలు..

**హైదరాబాద్, మార్చి 31:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి.. దివంగత జయలలితకు చెందిన హైదరాబాద్ నివాసాన్ని అధికారులు సీజ్ చేశారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ భవనానికి సంబంధించిన పన్ను బకాయిలపై అధికారులు ఫిబ్రవరిలోనే నోటీసులు జారీ చేశారు. జయలలిత వారసుల నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో సోమవారం ఈ ఇంటిని సీజ్ చేశారు. 2017 నుండి ఈ ఇంటికి సంబంధించి సుమారు 83 లక్షల రూపాయల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నట్లు సమాచారం.

**భారీగా పేరుకుపోయిన బకాయిలు**

మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) రాయితీ పోను.. మొత్తం 82,91,822 రూపాయలు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రీనగర్ కాలనీలోని ఈ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ భవనంలో ప్రైవేట్ కార్యాలయం నిర్వహించేవారని అధికారులు పేర్కొన్నారు. గడువు ముగిసినా స్పందించకపోవడంతోనే ఈ చర్యలు చేపట్టాల్సి వచ్చిందని వివరించారు.

**నివాస భవనంగా మార్చాలని విన్నపం**

ఈ భవనాన్ని 2017 నుండి నివాస అవసరాలకే వాడుతున్నామని.. కాబట్టి దీనిని రెసిడెన్షియల్ విభాగం కిందకు మార్చాలని జయలలిత మేనల్లుడు దీపక్



జయకుమార్ గతంలో అధికారులను కోరారు. అయినప్పటికీ పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. నిబంధనల ప్రకారం బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే సీజ్ తొలగిస్తామని స్పష్టం చేశారు. నగరంలో పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.



# అసెంబ్లీ సమయాన్ని వృథా చేసిన ప్రభుత్వం!

## కేరళ ప్రచారం కోసమే సభ వాయిదా..

## బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు..

### కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి

**హైదరాబాద్, మార్చి 31 :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ప్రభుత్వం అసెంబ్లీ సమయాన్ని వృథా చేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం సభను 30వ తేదీనే వాయిదా వేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నారని ఒకరోజు.. కేరళ నుండి వస్తున్నారని మరోరోజు గంటల కొద్దీ కాలయాపన చేశారని మండిపడ్డారు. విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇచ్చే పేరుతో కూడా విలువైన సమయాన్ని పాడు చేశారని ధ్వజమెత్తారు. సభలో ముఖ్యమంత్రి వాడుతున్న భాష అనాగరికమని.. తలలు తీస్తామన్న సభ్యులపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలు సరికావని హరీశ్ రావు ఖండించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రమే అన్ని అనుమతులు ఇచ్చిందని.. గడ్కరీ వంటి ప్రముఖులు దీనిని తెలంగాణకు వరప్రదాయినిగా కొనియాడారని గుర్తు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో కూడా కాళేశ్వరం వల్ల సాగు భూమి పెరిగిందని అంగీకరించారని తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం అసెంబ్లీలో ఇదే విషయాన్ని నివేదికలో పేర్కొన్నారని వివరించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రాజెక్టుపై బురద జల్లుతున్నారని ఆయన విమర్శించారు. కేవలం 50 కోట్ల రూపాయలు కేటాయిస్తే మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని.. దీనిపై గత రెండేళ్లలో 20 లేఖలు రాసినా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న కోపాన్ని రైతులపై చూపవద్దని హితవు పలికారు. సీఆర్ పాటిల్ క్షేత్రస్థాయిలో రైతులను అడిగితే నీళ్లు ఎలా వచ్చాయో తెలుస్తుందని సూచించారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కే ప్రయత్నం చేసినా.. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

# బెంగుళూరులో యువ టెక్కీ దంపతుల ఆత్మహత్య

### యువకుడిది సిద్దిపేటగా గుర్తింపు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు





**బెంగళూరు, మార్చి 31:** బెంగళూరులో విషాదం జరిగింది. తెలంగాణ సిద్దిపేటకు చెందిన యువ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముందుగా భర్త గదిలో ఆత్మహత్య చేసుకోగా, ఇది తెలిసిన భార్య వెంటనే బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని సిద్ధిపేట ప్రాంతానికి చెందిన భానుచందర్ రెడ్డి (32), అతడి భార్య బీబీ షాజియా సిరాజ్ (31) ఇద్దరూ కలిసి బెంగళూరులోని కోతనూర్ ఏరియాలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. వీరిద్దరూ వృత్తిపరంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. వీరి పెళ్ళై తొమ్మిది సంవత్సరాలు అవుతోంది. మొదట ఇద్దరూ లివ్ ఇన్ రిలేషన్‌లో ఉండి, ఆ తర్వాత కొంతకాలానికి పెళ్లి చేసుకున్నారు. అయితే, పెళ్ళైనప్పటి నుంచి వీరిద్దరి మధ్యా విబేధాలు తలెత్తాయి. దీంతో తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో సోమవారం భానుచందర్ రెడ్డి తన గదిలోపల తలుపు పెట్టుకుని, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాజియా సిరాజ్ ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన రాలేదు. దీంతో ఆమె సెక్యూరిటీతోపాటు చుట్టుపక్కల వాళ్లను పిలిచింది. వారు వచ్చి తలుపు బద్దలుకొట్టి చూసేసరికి భానుచందర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది చూసి దిగ్భ్రాంతికి గురైన భార్య సాజియా వెంటనే అదే అపార్ట్‌మెంట్ 17వ అంతస్థు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు జరుపుతున్నారు. వీరి మృతికి వైవాహిక కలహాలతోపాటు భాను చందర్ రెడ్డి అనారోగ్యం కూడా ఒక కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి విచారణ అనంతరం అసలు విషయాలు తెలిసే అవకాశం ఉంది. అధిక ఒత్తిడి, అనారోగ్యం, మానసిక సమస్యలు తదితర కారణాలేమైనా అయ్యుండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తే తప్ప ఈ దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని పోలీసులు వివరించారు. మరోవైపు మృతుల తల్లిదండ్రులు ఇప్పటికే బెంగళూరు చేరుకున్నారు. వీరి మృతితో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# పీఆర్సీ, డీఏ విడుదల చేయకపోతే టెన్త్ స్పాట్ బహిష్కరిస్తాం

**నల్లగొండ, మార్చి 31:** రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ, డీఏ విడుదల చేయకపోతే పదో తరగతి స్పాట్ బహిష్కరిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండతో పాటు పలు ప్రాంతాలోని పాఠశాలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ సన్మానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళవారం రాత్రి వరకు పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన చేసిన సర్వే రెమ్యూనరేషన్స్ సహితం ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికి అమలు చేయకపోవడంతో తీవ్ర మనోవేదనలో ఉన్నారన్నారు.

# ఇప్ప సారాకు వేల ఏళ్ల చరిత్ర

- నాపై దుష్ప్రచారం ఎందుకు?
- కల్తీ సారా వద్దంటే బద్నాం చేస్తారా అని ఎమ్మెల్యే ఆగ్రహం..
- సినీ తారలు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలి..
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 31 :** తాను ఇప్పపూవు సారా గురించి మాట్లాడితే కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. కల్తీ సారా తాగవద్దని సూచిస్తే తనను బద్నాం చేయడం ఏమిటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు వ్యక్తిగత గోప్యత అనేది లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు మద్యం తయారు చేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే ఒప్పా? అని ప్రశ్నించారు. ఇప్ప సారాకు మూడు వేల ఏళ్ల నాటి శతాబ్దాల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

### ఆరోగ్యానికి మేలు చేస్తుంది

ఇప్ప సారాను అసలైన 'ఇండియన్ లిక్కర్' అని అనిరుధ్ రెడ్డి అభివర్ణించారు. ఈ రకమైన సారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని.. గతంలో దీనిని తాగిన వారు 110 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికారని వివరించారు. తన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఆయన మండిపడ్డారు. కల్తీ మద్యానికి దూరంగా ఉండాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన ఇప్ప సారాకు ఉన్న గొప్పతనాన్ని విస్మరించి తనను తప్పుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు.

### సినీ తారలకు డ్రగ్ టెస్ట్ సవాల్

ఈ సందర్భంగా సినీ తారలపై అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వచ్ఛందంగా డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని.. అలాగే సినీ నటులు కూడా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వారిపైనే ఎక్కువగా డ్రగ్స్ ఆరోపణలు వస్తున్నాయని గుర్తు చేశారు. రాజకీయ నాయకులపై ఇలాంటి పుకార్లు తక్కువేనన్నారు. నటులు ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలని.. ఫలితం నెగెటివ్ వస్తేనే షూటింగ్‌లలో పాల్గొనేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ బారిన పడిన వారు చిత్ర పరిశ్రమలోనే ఎక్కువగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్యం.. ధూమపానం వంటి వాటికి దూరంగా ఉంటారని.. తాము కూడా డ్రగ్స్ కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

- ఏప్రిల్ 4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశం!
- పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యల కేసులో సీఐడీ నోటీసులు..
- సాక్ష్యాలను తారుమారు చేయవద్దని అధికారుల హెచ్చరిక..

**హైదరాబాద్, మార్చి 31 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు జారీ చేసింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర వద్ద జరిగిన గొడవలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తును ప్రభుత్వం సీఐడీకి అప్పగించడంతో.. ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు. హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈ నోటీసులు ఇచ్చారు.

### పోలీసుల విధులకు ఆటంకం

సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగించారని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు అసౌకర్యం కలిగించడమే కాకుండా.. విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకున్నారని కేసులో పేర్కొన్నారు. ఉన్నత స్థాయి పోలీస్ అధికారులను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించారని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయ్యాయి.

### సహకరించకపోతే కఠిన చర్యలు

వచ్చే నెల 4వ తేదీ ఉదయం 11:30 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. వచ్చేటప్పుడు తన గుర్తింపు పత్రాలు.. ఈ కేసుకు సంబంధించిన ఇతర పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని.. సాక్ష్యాలను చెడగొట్టే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. ఒకవేళ నోటీసులను పట్టించుకోకుండా విచారణకు గైర్హాజరైతే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐడీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



# చికెన్ షాపుల బంద్.. మార్జిన్ పోరు!

- కిలోకు 30 రూపాయల లాభం కావాలని డిమాండ్..
- నేటి నుండి నిరవధిక సమ్మెకు పిలుపు..
- చికెన్ దుకాణ యజమానుల సంఘం

**హైదరాబాద్, మార్చి 31 :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే మార్జిన్లను పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాపుల యజమానుల సంఘం హెచ్చరించింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇస్తున్న లాభం చాలా తక్కువగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఇరవై ఏళ్లుగా కిలోకు 26 రూపాయల మార్జిన్ ఇచ్చేవారని.. కానీ ఇటీవల దానిని 16 రూపాయలకు తగ్గించారని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలతో దుకాణాలు నిర్వహించడం అసాధ్యంగా మారిందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కిలో చికెన్ పై కనీసం 30 రూపాయల మార్జిన్ ఇవ్వాలని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన అద్దెలు.. కరెంటు బిల్లులు.. పనివారి జీతాల దృష్ట్యా పాత మార్జిన్లతో బతకలేమని స్పష్టం చేశారు. మార్జిన్ పెంపుపై పౌల్ట్రీ యాజమాన్యాల నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ నిరసన ఆగదని ప్రకటించారు.



### వినియోగదారులకు ఇబ్బందులు

దుకాణదారుల ఆకస్మిక బంద్ నిర్ణయంతో సామాన్య ప్రజలకు చికెన్ దొరకని పరిస్థితి ఏర్పడింది. తక్కువ మార్జిన్ వల్ల తమ జీవనోపాధి సవాల్‌గా మారిందని.. అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని.. ప్రభుత్వం కూడా ఇందులో జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# ప్రజా పాలన ప్రగతిపై సీఎస్ సమీక్ష!

**హైదరాబాద్, మార్చి 31 :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు పురోగతిపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏప్రిల్ 2 నుండి గ్రామ సభలు.. వార్డ్ సభలను ఇప్పటికే జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పారదర్శకంగా.. క్రమబద్ధంగా ఈ సమావేశాలు జరగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు.. ప్రజల భాగస్వామ్యం.. విభాగాల సమన్వయం ఈ కార్యక్రమ విజయానికి కీలకమని స్పష్టం చేశారు.

### పథకాలపై విస్తృత అవగాహన

ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు.. సంక్షేమ కార్యక్రమాలు.. బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఈ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించి.. పథకాల ప్రభావాన్ని అంచనా వేసి మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ గ్రామ సభల నిర్వహణకు అనుసరించాల్సిన కార్యాచరణపై అధికారులకు వివరణ ఇచ్చారు.

### ఆరోగ్య వారోత్సవాలు.. పన్ను వసూళ్లపై గుర్తింపు

మున్సిపల్ శాఖ కార్యదర్శి టీ.కే. శ్రీదేవి మాట్లాడుతూ.. వార్డ్ సభలలో వంద శాతం పన్ను వసూలు సాధించిన సిబ్బందిని సత్కరించాలని సూచించారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తు.. ఏప్రిల్ 6 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొని ప్రగతి నివేదికలను సమర్పించారు.





సంపాదకీయం

# భారత ఎన్నికల తీరు మారాల్సిందే!

ఎన్నికల సంస్కరణలు చేయకుండా, పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెంచినంత మాత్రాన భారత్ భవిష్యత్ మారదు. రాజకీయ పార్టీలకు మేలు చేసే నిర్ణయాలు తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం లేదు. ప్రధానంగా పదేపదే సభ్యులు కొందరే పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఎన్నికవుతున్నారు. దీనిని అరికట్టాల్సి ఉంది. సీట్లు పెంపు తీరును తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తప్పు పడుతున్నారు. దీంతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని అంటున్నారు. దీనిపైనా చర్చించాలి. దేశంలో ప్రజలకు రాజకీయ అవకాశం రావాలి. ముఖ్యంగా దళిత, గిరిజన, మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు రావాలి. వారిని ఈ దేశ అధికారంలో భాగస్వామ్యం చేయాలి. కానీ అలా జరగడం లేదు. కేవలం కొన్ని సీట్లు వారికి కేటాయిస్తు న్నాయి. రాకీయంగా దళితులు, గిరిజనులకు కనీసం 50శాతం సీట్లు రిజర్వ్ చేయాలి. అందులోనూ గతంలో వరుసగా ఎన్నికవుతూ వస్తున్న వారిని మళ్లీ పోటీకి దూరం చేయాలి. అలాగే రెండు టర్మ్‌లకు మించి అవకాశం లేకుండా సంస్కరణలు చేయాలి. లేదా రాజ్యాంగ సవరణ చేయాలి. అప్పుడే ఇప్పుడు పాతుకు పోయిన వారు బయటకు పోతారు. పార్లమెంట్, అసెంబ్లీలో కొత్తతరం ప్రవేశిస్తుంది. కొత్తగా ఆలోచిస్తారు. ఇటీవల పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ తూతూ మంత్రంగా సాగింది. అసలు విషయాలను పక్కదారి పట్టించేలా చేశారు. ఇలాంటి విషయాలను ఏ ఒక్కరూ ప్రతిపాదించలేదు. అధికార బిజెపి లేదా ఎన్‌డిఏ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించి, రాజ్యాంగ సవరణకు పూనుకోవాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుంటున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. ఇలాంటి ఎన్నికల వల్ల కొందరే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. అలాగే ఒక వ్యక్తి రెండుచోట్ల పోటీ చేసే పద్ధతిని కూడా రద్దు చేయాలి. గతంలో రాహుల్ రెండుచోట్ పోటీ చేశారు. మోడీ చేశారు. ఇప్పుడు తమిళనాట విజయ్ కూడా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీనివల్ల కూడా ఖజానాపై భారం పడుతుంది. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీలది ఒకటే దారిగా ఉంది. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నేతలు నియంతలుగా మారుతున్నారు. ఈ క ÷-రమంలో ఇప్పుడు పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెరగడం వల్ల మరికొందరు చట్టసభల్లోకి వస్తారు. దీంతో ఖజానాపై మరింత భారం పడుతుంది. అలాగే వారికి సౌకర్యాలు పెరుగుతాయి. అందువల్ల ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు, జీతభత్యాలు, పెన్షన్లను కూడా రద్దు చేయాలి. ఒక్కో ప్రజాప్రతినిధి రెండేసి పెన్షన్లు కూడా పొందుతున్నారు. పార్లమెంటుకు పనిచేసి, అసెంబ్లీకి ఎన్నికైన వారు రెండుచోట్లా పెన్షన్లు పొందుతున్నారు. అందుకే చట్టసభలకు తప్ప, సభ్యులకు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే విధానం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్ధత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని వితండ వాదనతో దీనిని వ్యతిరేకిస్తున్నారు. అందుకే ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

- ఆయుధ నిల్వల డిపోపై దాడి

**టెహ్రాన్, మార్చి 31:** ఇరాన్ అణు కేంద్రక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా భీకర దాడులు చేసింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై బంకర్ బస్టర్లతో విరుచుకుపడింది. రెండు వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో దాడులు చేయడంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో పంచుకున్నారు. అయితే దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణా ఇవ్వలేదు. ఇస్ఫహాన్‌లో ఇరాన్ ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేసినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వెల్లడించింది. ఇస్ఫహాన్‌పై వరుస దాడులు జరగడంతో ఆ ప్రాంతంలో భారీగా మంటలు చెలరేగుతున్నట్టు పేర్కొంది. అయితే ఈ దాడులపై ఇరాన్ ఇప్పటివరకు స్పందించలేదు. కాగా, ఇస్ఫహాన్‌లోని ఓ భూగర్భ కేంద్రంలో సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇరాన్ దాచినట్టు వార్తలు వస్తున్నాయి. ఆ యురేనియం నిల్వల లక్ష్యంగానే తాజా దాడులు జరిగినట్టు సమాచారం. కాగా, తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌పై భారీగా దాడులు చేస్తామని ఇప్పటికే ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికాతో ఒప్పందానికి అంగీకరించేది లేదని ఇరాన్‌కు చెందిన పలువురు కీలక నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా దాడులకు దిగినట్టు తెలుస్తోంది.



# బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

- నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి
- సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం

**కోల్‌కతా, మార్చి 31:** భారతీయ జనతా పార్టీపై పశ్చివ-ంబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷-గ్గ్÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ పక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోందని అన్నారు.



# అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

- 31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల

గౌహతి, మార్చి 31: త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హామీల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా అన్నారు. అలాగే లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన అన్నారు. యుసిసిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల పరిధిలోకి వచ్చే ప్రాంతాల నుంచి మినహాయిస్తామని, గిరిజన వర్గాల్లో దీని అమలు చేయమని ఆయన అన్నారు. రద రహిత అస్సాంను మార్చేందుకు రాబోయే రెండేళ్లలో 18 వేల కోట్లను ఖర్చు చేస్తాం. లక్షపతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు 25 వేల రూపాయలు అందిస్తాం. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల జాబ్‌లు ఇస్తాం. ఒక జిల్లా, ఒక కళాశాల, ఒక విశ్వవిద్యాలయం, ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. అరుణోదరు పథకం కింద ఇస్తున్న రూ. 1250లను పెంచి మహిళలకు 3,000లు అందించడానికి ప్రయత్నిస్తాం అని హిమంతబిశ్వ శర్మ అన్నారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సర్బానంద సోనోవాల్, ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా హాజరయ్యారు.



# నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

## 8మంది మహిళా భక్తులు మృత్యువాత

**పాట్నా, మార్చి 31:** బీహార్‌లోని నలందలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నలందలో ఒక ఆలయం వద్ద తొక్కిసలాట జరిగింది. నలంద జిల్లాలోని శీతలా మాత ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. అందరూ మహిళలే కావడం గమనార్హం. ఈ ఘటనలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళవారం నాడు ఈ గుడికి వస్తుంటారు. నిర్వహణ లోపం కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పిపోడిపోయిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. బాగా రద్దీగా ఉ ఒడడంతో అంబులెన్స్‌లు కూడా అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. గాయపడిన వారికి స్థానికులు సపర్యలు చేస్తున్నారు. చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు.

# కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

## ఎల్డీఎఫ్‌తో బీజేపీ కుమ్మక్కు
## అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు
## మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత

**తిరువనంతపురం, మార్చి 31:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.





# నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

**ఇక శాశ్వత రాజధానిగా అమరావతి**

**ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం**

**టీడీపీ ఎంపీలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి**

**న్యూఢిల్లీ, మార్చి 31:** రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. అమరావతి తీర్మానం లోక్‌సభ ఆమోదం తరవాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుందని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు రాజధానిపై అసలు స్పష్టత లేదని విమర్శించారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఎంపీ లావు గుర్తు చేశారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని.. ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్‌లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని.. ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని.. రాజధాని సైతం వారి హయంలోనే గుర్తిస్తున్నారని ఎంపీ అప్పలనాయుడు వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. వైసీపీ నేతలు సైతం రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది చెంపపెట్టు అన్నారు. రాజధాని అమరావతిపై జగన్ తన వక్రబుద్ధి చూపించారని చెప్పారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడి దార్శనికత అందరికీ తెలుసునన్నారు. అమరావతి కోసం ప్రాణత్యాగం చేసిన రైతులకు ఈ సందర్భంగా పాదాభివందనం చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎంపి అప్పలనాయుడు చెప్పారు.

# జాతీయస్థాయిలో పంచాయతీలకు పురస్కారాలు

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు**



**అమరావతి, మార్చి 31:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మరోసారి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. వరుసగా రెండో ఏడాది దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ జాతీయ పురస్కారాలకు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు.. ఈ విజయాలు గ్రామీణాభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించిన పంచాయతీగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని బొక్కసం పాలెం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోవడం విశేషమని పవన్ అన్నారు. అదేవిధంగా సుపరిపాలన విభాగంలో విశాఖపట్నం జిల్లా శృంగవరం గ్రామ పంచాయతీ మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. గ్రామ స్థాయిలో పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల అంశాల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చెమ్ముళ్లపల్లి గ్రామం జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించగా, మౌలిక సదుపాయాల కల్పనలో స్వయం సమృద్ధి సాధించిన పంచాయతీల్లో ప్రకాశం జిల్లా గుండమల గ్రామ పంచాయతీ మూడో స్థానంలో నిలిచింది. ఇక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ పరిధిలోని కుప్పం మండలం జాతీయ స్థాయిలో మూడో అత్యుత్తమ మండలంగా ఎంపిక కావడం ప్రత్యేకంగా నిలిచింది. గత ఏడాది కూడా పంచాయతీరాజ్ శాఖ వివిధ విభాగాల్లో నాలుగు అవార్డులు గెలుచుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ విజయాలకు కారణమైన గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు అందరికీ పవన్ కల్యాణ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గ్రామీణాభివృద్ధికి తమ కృషిని గుర్తించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవార్డులు తమపై మరింత బాధ్యతను మోపాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# క్వాంటం హబ్‌గా అమరావతి

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సీడాక్, సీడాట్, డీఆర్ డీఓ, నేవల్ సైన్స్ టెక్నాలాజికల్ లేబొరేటరీ, బార్క్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. క్యూబిట్ ఫోర్స్, క్యూబీట్స్, క్వాంటం ఏఐ గ్లోబల్, క్యూపిఐ ఏఐ, ఆటోమియోనిక్స్ , తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ సత్యనారాయణ హాజరయ్యారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ కామకోటి వర్చువల్ గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి క్వాంటం కంప్యూటర్ పరికరాల తయారీ కంపెనీలు, క్రయోజనిక్స్, ఫోటోనిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు సైతం హాజరయ్యారు. వారిని ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ.. రెండేళ్లలో దేశీయంగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తి దిశగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. త్వరలో సిద్ధం కానున్న ఏక్యూవీ నుంచి క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు, ఇతర హార్డ్ వేర్ ఉత్పత్తి, అల్గారిథమ్స్ రూపకల్పన వంటివి చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 5 గ్లోబల్ క్వాంటం హబ్స్ లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయం వ్యక్తం అయ్యింది. అమరావతి క్వాంటం వ్యాలీలో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు హార్డ్ వేర్, ఎకోసిస్టం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బయోఫౌండ్రీ సహా వివిధ స్టార్టప్ ల సహకారంతో డిజైన్లు, ఆవిష్కరణలు, పరిశోధన చేపట్టాలని సమావేశంలో చర్చించారు. మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తికి విస్తృత ప్రయత్నాలు చేయాలని సూచించారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటింగ్ పాలసీ కలిగిన రాష్ట్రంగా ఏపీ ఇప్పటికే క్వాంటం టెక్నాలజీ ప్రయాణాన్ని ప్రారంభించిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విజయవాడలోని మేధా టవర్స్ లో ఇప్పటికే తాత్కాలికంగా క్వాంటం కంప్యూటింగ్ మిషన్ కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయని వివరించారు.



**ఏపీకే క్వాంటం తొలి ప్రయోజనాలు**

మూడు దశాబ్దాల క్రితం ఐటీని, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్ టెక్నాలజీని ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్ గా అందిపుచ్చుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు. గతంలో ఐటీలో నిపుణుల్ని తయారుచేయడానికి ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్నామని... ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని అందిపుచ్చుకునేలా నిపుణులకు శిక్షణ ఇస్తున్నామని వివరించారు. వైసర్, ఐబీఎం లాంటి సంస్థల సహకారంతో యువతకు క్వాంటంలో నైపుణ్యాలు పెంచుతున్నామన్నారు. అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరించటంతో పాటు రియల్ టైమ్ లో నిర్ణయాలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమిస్ట్ లాంటి సేవలు పౌరులకు అందాల్సి ఉందన్నారు. ఆధునిక టెక్నాలజీలను తొలిగా అందిపుచ్చుకున్న వారికే ఎప్పుడూ ప్రయోజనాలు దక్కుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఐటీ ద్వారా హైదరాబాద్ నాలెడ్జి ఎకానమీగా మారిందని తద్వారా సేవల రంగం పెరిగి దేశానికి ప్రయోజనం కలుగుతోందన్నారు. భవిష్యత్తు అంతా ఇక క్వాంటం కంప్యూటింగ్‌దేనని జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యానికి అనుగుణంగా ఏక్యూవీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్ టీ సహకారంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏపీలో ఏర్పాటు అవుతోందని సీఎం వివరించారు. రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు స్టార్టప్‌లకు కూడా అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. క్వాంటం హార్డ్ వేర్ దిగుమతి కాకుండా ఇక్కడే తయారు చేసుకోవాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియచేశారు. క్వాంటం పరికరాలు, టెక్నాలజీ, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ ఇలా మనమే తయారు చేసుకునేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీతో అమరావతి ఇక భవిష్యత్ నగరంగా అత్యుత్తమ లివబుల్ సిటీగా మారుతుందన్నారు. దీనికి అవసరమైన టెక్నాలజీని, భాగస్వామ్యాన్ని అందించాలని జాతీయ క్వాంటం మిషన్ ను ముఖ్యమంత్రి కోరారు.

**ఏప్రిల్ 14న అందుబాటులోకి..**

దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏప్రిల్ 14 తేదీ నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నట్టు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థులు, పరిశోధకులకు ఈ క్వాంటం కంప్యూటర్ టెస్టింగ్ కోసం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. క్వాంటం ఎకోసిస్టమ్ కు అనువుగా టెస్ట్ బెడ్స్, సర్టిఫికేషన్ లాంటివి ఉండాలని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీడాక్ ఈడీ సుదర్శన్ వివరించారు. క్వాంటం సిమ్యులేటర్స్ తో పాటు బయోసెన్సార్స్, మినరల్ సెన్సార్స్, లేజర్ అప్లికేషన్స్ అమరావతి క్వాంటం వ్యాలీలో అందించేందుకు సిద్ధమని వివిధ క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు ముఖ్యమంత్రికి తెలియచేశాయి. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకోవటంలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఎన్ క్యూఎం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తంగా 30కి పైగా క్వాంటం కంప్యూటింగ్ పరికరాల తయారీ కంపెనీలు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాయి. 15 కంపెనీలతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకుంది. విజయవాడలోని మేధా టవర్స్ లో 7 సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.

# నేతన్నలకు 'పవర్' ఫుల్ కానుక

- నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అమలు!
- మగ్గాలకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు ఫ్రీ..
- 1.04 లక్షల కుటుంబాలకు లబ్ధి
- ఏడాదికి రూ. 150 కోట్లు వెచ్చించనున్న ప్రభుత్వం..
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సీఎం



**అమరావతి, మార్చి 31 (మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చేనేత వర్గాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, బుధవారం ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా లక్షలాది మంది చేనేత కళాకారుల కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం చేకూరుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ పథకం కింద సాధారణ చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ లేదా మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు విద్యుత్తును ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93,000 చేనేత కుటుంబాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ప్రత్యక్షంగా ప్రయోజనం పొందుతాయి. ఈ రాయితీ ద్వారా ఒక్కో చేనేత కార్మికుడి కుటుంబానికి ఏడాదికి రూ. 8,640 వరకు, పవర్ లూమ్ యూనిట్లకు ఏడాదికి రూ. 21,600 వరకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ. 150 కోట్ల భారాన్ని భరించనుంది. గత ప్రభుత్వ హయాంలో సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని గట్టెక్కించేందుకు ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగానే చేనేత కార్మికుల పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అలాగే కొత్త యంత్రాల కొనుగోలుపై 90 శాతం రాయితీని అందిస్తూ నేతన్నల పనిముట్ల ఆధునీకరణకు ప్రాధాన్యతనిస్తోంది. నూలు వంటి ముడి సరుకులపై 15 శాతం రాయితీ కల్పిస్తూ నాణ్యమైన సరఫరాకు చర్యలు చేపట్టింది. నేతన్నల ఉత్పత్తులను నేరుగా విక్రయించేలా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల ద్వారా ఈ-కామర్స్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. చిన్న క్లస్టర్ల అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 10.44 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం, తాజాగా ఉచిత విద్యుత్ అమలుతో చేనేత వృత్తికి పెద్దపీట వేసింది. విద్యుత్ ఛార్జీల భారం తగ్గడం వల్ల నేతన్నల పనితీరు మెరుగుపడటమే కాకుండా వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం నేతన్నల పక్షాన నిలిచింది.

# చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పేలుడు

- ఐదుగురు పోలీసులకు గాయాలు
- సీజ్ చేసిన టపాసులను పరిశీలిస్తుండగా ప్రమాదం
- ఎస్సైతో సహా ముగ్గురికి తీవ్ర గాయాలు.. విజయవాడకు తరలింపు
- చల్లపల్లి ఘటనపై కృష్ణా ఎస్పీ వివరణ
- హోం మంత్రి అనిత, ఇంచార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ దిగ్భ్రాంతి

**చల్లపల్లి, మార్చి 31:** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఉదయం ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో తీవ్ర కలకలం రేగింది. గత ఏడాది అక్టోబరులో అక్రమ నిల్వలపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న టపాసులను, కోర్టు ఆదేశాల మేరకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎస్సై సహా ఐదుగురు పోలీసు సిబ్బంది గాయపడగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. కృష్ణా జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వివరాల్లోకి వెళితే.. సీజ్ చేసిన టపాసులను స్టేషన్ ఆవరణలో భద్రపరిచారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం వాటిని బుధవారం కోర్టులో ప్రవేశపెట్టేందుకు కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా, డ్రైవర్ నాగరాజు బయటకు తీస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి గాజు ముక్కలు శరీరంలోకి దిగడంతో కానిస్టేబుల్ అబ్దుల్లా తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ నాగరాజుకు కంటి వద్ద గాయాలయ్యాయి. వీరిద్దరితో పాటు ఎస్సై దుర్గాంజనేయులకు కూడా తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ పార్వతి స్వల్ప గాయాలతో చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సీజ్ చేసిన టపాసులను కోర్టులో సబ్మిట్ చేసే క్రమంలో కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా, డ్రైవర్ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఎస్ఐ దుర్గాంజనేయులుకు స్వల్ప గాయాలు కాగా, ముగ్గురిని విజయవాడ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కానిస్టేబుల్ పార్వతీ, హెడ్ కానిస్టేబుల్ తేజ చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు.

**స్పందించిన ప్రభుత్వం**

ఈ ఘటనపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా ఇంచార్జి మంత్రి



వాసంశెట్టి సుభాష్ కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్ స్టేషన్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, సీజ్ చేసిన పేలుడు పదార్థాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రజల్లో ఎలాంటి భయం అవసరం లేదని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని స్పష్టం చేశారు.

# ముజీబ్‌కు ఘన సన్మానం




**హైదరాబాద్ మార్చి 31 (సమయం న్యూస్) :** టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షులుగా మారం జగదీశ్వర్ , ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ ఈఎన్టి యూనిట్ అధ్యక్షులు తూముకుంట రాజు, నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తూముకుంట రాజు మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్ గారు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఉద్యోగులందరికీ గర్వకారణమన్నారు. వారి నాయకత్వంలో టీఎన్జీవోస్ సంఘం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు, సభ్యులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

**- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్**



**సమయం న్యూస్ గజ్వేల్, 31 మార్చి 2026 :** ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తూప్రాన్ బస్టాండ్‌ల ఆధునీకరణ, నిర్మాణాల కోసం నిధులను మంజూరు చేసిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయకుండా తాత్సారం చేస్తోందని ఆరోపించారు. పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా అవసరాలను గుర్తించి, వెంటనే నిధులు విడుదల చేసి యుద్ధప్రతిపాదికన బస్టాండ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కర్ పద్మాబాయి నర్సింగ్ రావు, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పాఠశాలలకు ఎంపికలు

- **ఎస్.వెంకటేష్ DYSO నారాయణపేట జిల్లా**



**నారాయణపేట, మార్చ్,31(సమయం న్యూస్) :** మినీ స్టేడియం నారాయణపేట నందు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో గల క్రీడా పాఠశాలలో 4వ తరగతి నందు ప్రవేశం కొరకై జిల్లా స్థాయి ఎంపికలు మంగళవారం నిర్వహించడం జరిగినట్లు వెంకటేష్ తెలిపారు. ఈ ఎంపికలకు నారాయణపేట జిల్లాలోని వివిధ మండలాలకు సంబంధించిన 74 మంది బాల బాలికలు పాల్గొనడం జరిగింది. ఈ జిల్లా స్థాయి నందు ఎంపిక అయిన బాల బాలికలకు తేది 30-04-2026 మరియు 01-05-2026 లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు హాకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్, హైద్రాబాద్‌కు పంపుతున్నట్లు తెలిపారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఎస్. వెంకటేశ్ మరియు పి.డిలు/పి.ఇ.టీ లు ఉన్నారు.

## స్కూల్ విద్యార్థినిపై పలుమార్లు లైంగిక దాడి.. 14 ఏళ్లకే తల్లయిన బాలిక- కర్నూలులో దారుణం

కర్నూలులో 14 ఏళ్ల బాలికపై జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

కూలి పనులు చేసుకునే దంపతులు 9వ తరగతి చదువుతున్న తమ కుమార్తెను రోజూ ఆటోలో స్కూలుకు పంపేవారు.

అయితే, ఆ ఆటో డ్రైవర్ బోయ మహేంద్ర బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం అతని స్నేహితుడు, ట్రాక్టర్ డ్రైవర్ అయిన తెలుగు శివకుమార్ కూడా బాలికను బెదిరించి కోరిక తీర్చుకునేవాడు.

ఎవరికైనా చెబితే చంపేస్తామని నిందితులిద్దరూ భయపెట్టడంతో, ఆ బాలిక తన బాధను ఎవరికీ చెప్పుకోలేకపోయింది.

డాక్టర్లు చెప్పిన మాటలకు తల్లిదండ్రులు షాక్..

నిందితులు లైంగిక వేధింపులు కొనసాగడంతో ఆ బాలిక గర్భం దాల్చింది. మార్చి 28న ఆమె అనారోగ్యానికి గురికావడంతో కుమార్తెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. డాక్టర్లు ఆమె గర్భవతి అని నిర్ధారించడంతో తల్లిదండ్రులు షాకయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఆ విద్యార్థిని మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. నిందితులు బాలిక కుటుంబ సభ్యులను బెదిరించినట్లుగా ఉన్న ఫోన్ రికార్డింగ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆ బాలిక తీవ్రమైన మానసిక వేదనలో ఉండటంతో సోమవారం రాత్రి వరకు కేసు నమోదు కాలేదు. బాధితురాలి తల్లిదండ్రులు పేదవారు కావడం, పైగా నిందితుల నుంచి ప్రాణహాని ఉందని భయపడుతుండటంతో అధికారులు బాలికను, శిశువును సురక్షితంగా ఉంచేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలోకి తరలించాలని నిర్ణయించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పోలీస్ శాఖలో అందించిన సేవలు అభినందనీయం

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**
- **శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి-ఎస్పీ.**



**నారాయణపేట, మార్చ్,31(సమయం న్యూస్) :** నారాయణపేట: దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో హెచ్ సీ (HC)గా విధులు నిర్వహిస్తున్న కె. బాలప్ప మంగళవారం పదవి విరమణ చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి ఆయన పోలీస్ శాఖకు చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఉద్యోగ నిర్వహణలో ప్రతి ఒక్కరికీ పదవి విరమణ తప్పనిసరి ప్రక్రియ అని పేర్కొంటూ, పీసీ స్థాయి నుంచి హెడ్ కానిస్టేబుల్ వరకు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో పోలీస్ శాఖకు సేవలందించిన కె. బాలప్ప సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన పోషించిన పాత్రను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అలాగే పోలీస్ శాఖ నుండి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ స్టాఫ్ కు ఆదేశించారు. పదవి విరమణ అనంతరం ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీస్ శాఖ పూర్తి అండగా ఉంటుందని, అవసరమైతే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు. కె. బాలప్ప 1992 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరి, అంచలంచలుగా పీసీ, హెడ్ కానిస్టేబుల్ హోదాల్లో పదోన్నతీ పొంది, మొత్తం 10 పోలీస్ స్టేషన్లలో 35 సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించి, దామరగిద్ద పోలీస్ స్టేషన్ నుండి పదవి విరమణ పొందారు. ఆయనకు భార్య మణెమ్మ 04 గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు రాజు, నరేష్, డీపీఓ సీనియర్ అసిస్టెంట్ అశోక్, అల్లుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

# క్షేమంగా ఇంటికి చేరడమే 'అర్రైవ్ - అలైవ్' లక్ష్యం

- **ముఖ్యఅతిథిగా పాల్గొన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్**
- **కొడంగల్ లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన -ఎస్పీ**
- **"ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా....**



**కొడంగల్ మున్సిపల్, మార్చ్,31(సమయం న్యూస్) :** "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 'అర్రైవ్ - అలైవ్' (ూాతీతీఱఙవ-ాశ్రీఱఙవ) మరియు డ్రగ్స్ నివారణ అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించి, పలువురికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నేటి యువత దేశానికి వెన్నెముక అని, అటువంటి యువశక్తిని నిర్వీర్యం చేసేందుకు డ్రగ్స్ మాఫియా పన్నుతున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డ్రగ్స్ అనే మత్తు ఊబిలో చిక్కుకుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరా గురించి ఎలాంటి సమాచారం ఉన్నా భయం లేకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎస్పీ భరోసా ఇచ్చారు. అనంతరం 'అర్రైవ్ - అలైవ్' కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ.. ప్రతి రోజూ ఉపాధి కోసం బయటకు వెళ్లే వ్యక్తులు తిరిగి క్షేమంగా తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు, డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తు.చ తప్పకుండా పాటించాలని, రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు చూపు స్పష్టంగా ఉండటం అత్యంత కీలకమని, అందుకే డ్రైవర్ల కోసం ఈ ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి డ్రైవర్ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై జి. వి. సత్యనారాయణ, ఎంవీఐ వసంత్, కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్, స్థానిక కౌన్సెలర్లు, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో యువత, వాహనదారులు పాల్గొన్నారు.

# సమగ్ర అవగాహన ద్వారా మాత్రమే ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రజలు తమను తాము కాపాడుకోగలరు.


- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**భూపాల పల్లి మార్చి31( సమయం న్యూస్) :** మంగళవారం గణపురం మండలంలోని గన్పూర్ రిజర్వాయర్ లో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో వరదలు, నీట మునిగితే ఎలా కాపాడుకోవాలో అన్న అంశంపై నిర్వహించిన డెమో కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వరదలు వంటి విపత్తులు, ప్రజలు ఏదేని ప్రమాదం వల్ల నీటిలో మునగడం చిక్కుకుపోవడం వంటి ప్రమాదాల నుంచి ఎలా కాపాడుకోవాలో డెమో ప్రదర్శించారు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు వంటి విపత్కర సమయాల్లో ఎలా రక్షించుకోవాలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశ్యంతో డెమో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అవగాహన కలిగి ఉండటం ద్వారా మాత్రమే మనతో. పాటు ఇతరుల ప్రాణాలను కాపాడొచ్చునని తెలిపారు. వరదల సమయంలో రక్షణ చర్యలను బలోపేతం చేయడానికి స్విమ్మింగ్ క్లబ్బులు ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో మోరంచపల్లి వాగు ప్రవాహం కారణంగా ప్రజలు, పశువులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఎలా అప్రమత్తంగా ఉండాలో ఈ డెమో ద్వారా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సమగ్ర అవగాహన కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ దామోదర సింగ్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా

- **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**అదిలాబాద్ మార్చి31( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ పథకం ప్రారంభం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారు సుమారు 10,000 కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నరని, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, త్వరలోనే ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, పి.హెచ్.సి కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును మొదలుపెడతామని తెలిపారు. అలాగే, మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా, స్వయంగా బస్సులను నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. పథకం ద్వారా ఆదా అయిన సొమ్మును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మహిళ, ట్రాన్స్ జెండర్ ప్రయాణికులను, ఉద్యోగులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల మహిళ ఉద్యోగులు, మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్‌తో మెదడుకు ఏమవుతుంది?

ఫోన్ ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం, ఆత్మహత్యల వరకూ వెళ్తున్నారు పిల్లలు. ఫోన్ ఎక్కువగా చూడటంవల్ల పిల్లల్లో నిద్ర, జాగురకత, భావోద్వేగాలు, ప్రవర్తన... వీటన్నింటిపైనా ప్రభావం ఉంటోంది. ఇదంతా క్రమశిక్షణ తప్పడంలా కనిపిస్తుంది పెద్దవాళ్లకు. కానీ పిల్లలు స్క్రీన్లకు ఎందుకు అతుక్కుపోతుంటారు, వాళ్లలో ఆ అలవాటుని ఎలా మార్పించాలి... వీటి గురించి నిపుణులు ఏం చెబుతున్నారంటే...

**సమస్య ఏంటంటే...**సరదానిచ్చే, నవ్వు తెప్పించే వీడియోలు చూడటంవల్ల మెదడులో డోపమైన్ విడుదలవుతుంది. దాంతో మళ్లీ అలాంటి వీడియోలు చూడ్డానికి ప్రేరేపిస్తుంది.

వేగంగా సాగిపోయే రీల్స్, షార్ట్స్ చూడ్డంవల్ల బ్రెయిన్‌కు ఏదైనా త్వరత్వరగా జరిగిపోవాలి అన్నట్లుగా అలవాటు అవుతుంది. దానివల్ల చదవడం, రాయడం, వినడం వీటికి అవసరమైనంత ఓర్పు, ఏకాగ్రత, నిదానం వాళ్లలో తగ్గుతాయి. వీడియోలతో నిద్రకు రెండు రకాలుగా హాని. ఒకటి... వీడియోలు చూస్తూ నిద్ర సమయం తగ్గడం. రెండోది... ఫోన్ నుంచి వచ్చే బ్లూ లైట్‌వల్ల ఇంకా నిద్రకు వేళ కాలేదని మెదడు భావించడం.

ఒత్తిడి, ఒంటరితనం, బోర్‌గా ఫీలవ్వడం... వీటన్నింటి నుంచి బయటపడ్డానికి ఫోన్‌ను ఆశ్రయిస్తుంటారు. తర్వాతర్వాత ఏ కాస్త ఒత్తిడి, ఒంటరితనం ఉన్నా ఫోన్ చూడాలనే ఆలోచన మెదడుకి అందుతుంది. హా

ఆటలంటే ఆసక్తి చూపకపోవడం, వద్దన్నా దొంగచాటుగా ఫోన్ చూడటం, చిరాకుహాపడటం... ఇవన్నీ పరిస్థితి చేయిదాటుతుందనడానికి చిహ్నాలు.

**మరి ఏం చేయాలి?..**స్క్రీన్ టైమ్‌కి నిర్ణీత వ్యవధి పెట్టండి. ఆ తర్వాత మొబైల్ డేటా, వై-ఫై ఆపేయండి. ఇది ఇంట్లో అందరికీ వర్తిస్తుంది.

నిద్రవేళలకు ముందు గంట వరకూ స్క్రీన్ చూడకూడదు. అంటే, నిద్ర సమయంలో ఫోన్‌ని పక్కన ఉంచొద్దు.

పిల్లల నుంచి ఫోన్లు తీసుకోవడమే కాదు, మెరుగైన ప్రత్యామ్నాయం చూపాలి. ఆటలు, సంగీతం, హాబీలు, కుటుంబమంతా కలిసి పనిచేయడం... ఇవన్నీ చేయొచ్చు. వీలైతే టీవీ, ల్యాప్‌టాప్‌లలో వీడియోలూ, సినిమాల్ని పిల్లలతో కలిసి పెద్దలూ చూడాలి. వాటి గురించి చర్చిస్తూ చూడటం ఎన్నో రకాలుగా మేలు. చదువు కోసం, ఏదైనా నేర్చుకోవడంలో భాగంగా ఫోన్లు, ల్యాపీలు చూస్తే అది మంచిదే. అలా కాకుండా, కాలక్షేపంగా మొదలైతే వ్యసనమవుతుంది.

# తెలంగాణ పల్లెలకు కేంద్రం తీపి కబురు..

## రూ.247 కోట్ల పంచాయతీ నిధులు విడుదల



**హైదరాబాద్ మార్చి31( సమయం న్యూస్). :**తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత అన్‌టైడ్ గ్రాంట్స్ కింద ఈ నిధులను కేటాయించింది. తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ. 1,500 కోట్లకు పైగా నిధులను కేంద్రం విడుదల చేసింది. కేంద్రం విడుదల చేసిన ఈ నిధుల ద్వారా తెలంగాణవ్యాప్తంగా ఉన్న దాదాపు 12,600 గ్రామ పంచాయతీలకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఇవి అన్‌టైడ్ గ్రాంట్స్ కావడంతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యత పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఊతమివ్వనున్నాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వాడాలని, సిబ్బంది జీతాలు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వినియోగించరాదని కేంద్రం స్పష్టమైన నిబంధనలు విధించింది. ఈ విడతలో అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 800 కోట్లు కేటాయించగా.. రాజస్థాన్‌కు రూ. 315.61 కోట్లు విడుదల య్యాయి. ఉత్తరాఖండ్‌కు రూ. 91.31 కోట్లు, మేఘాలయకు రూ. 49.20 కోట్లు అందాయి. తెలంగాణకు కేటాయించిన రూ. 247.94 కోట్లు రాష్ట్రంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ గ్రాంట్లను నేరుగా స్థానిక సంస్థల ఖాతాల్లోకి మళ్లిస్తోందని చెప్పారు. గతంలో నిధుల వినియోగంలో జరిగిన జాప్యం, మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ప్రతి పైసా ఆడిట్ కావాలని, గ్రామ పంచాయతీలు తమ అభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నిధులను సకాలంలో పంచాయతీలకు చేరవేసి, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పల్లె ప్రగతిలో ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. కాగా, గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. పల్లెల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దాదాపు రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు ఉండగా.. పాలకవర్గం కొలువుదీరటంతో అభివృద్ధి పనులు స్పీడ్‌గా కొనసాగుతున్నాయి....

# భావోజి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- తిమ్మారెడ్డిపల్లి లో జరిగే భావోజీ జాతర స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ
- (01-04-నుండి..4వ తేదీ వరకు జరగనున్న భావోజి జాతర...





**కొత్తపల్లిమండలం,మార్చ్,31(సమయంన్యూస్):** నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలం, తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి 4 వ తేదీ వరకు నిర్వహించబడుతున్న ప్రసిద్ధ భావోజి జాతర సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మంగళవారం రోజు జాతర నిర్వహణను సమగ్రంగా పరిశీలించిన ఎస్పీ, పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తేరు కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నలుగు దిక్కుల రోప్ పార్టీలు ఏర్పాటు చేయాలని, ముందస్తు బందోబస్తు ప్లాన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేయబడినట్లు, వాహనాల పార్కింగ్ కోసం వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జాతరలో భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి సంఘటనలను అరికట్టేందుకు మఫ్టీలో (సివిల్ డ్రెస్సులో) పోలీసులను మోహరించామని తెలిపారు. అదనంగా, మహిళలు మరియు పిల్లల భద్రత కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు క్యూఆర్టీ టీం ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణంలో ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు, భక్తులు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జాతర సమయంలో ప్రజలు పోలీస్ అధికారులతో సహకరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్, ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 99 డేస్ టీబీ ముక్తభారత్ సద్వినియోగం చేసుకోండి.

- డాక్టర్ రవీందర్ యాదవ్...
- జిల్లా టీబీ నిర్మూలన అధికారి..



**కొడంగల్ మండలం, మార్చ్,31(సమయం న్యూస్) :** రాష్ట్రం లో జరుగుతున్న 99డేస్ టీబీ ముక్తా భారత్ అభియాన్ ఫేస్ -2 ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈ కార్యంక్రమంలో భాగంగా మంగళవారం కొడంగల్ మండలంలోని రావులపల్లి హనుమాన్ గుడి దగ్గర నిర్వహించడం జరిగింది. ఇట్టి క్యాంపులో డాక్టర్. రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం ఆకలి లేకపోవడం ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే కొడంగల్ మరియు తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్లి పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ క్యాంపు లో మొత్తం 217 మందికి పరీక్షించడం దాంట్లో 25మందికి తేమదా పరీక్షించడం జరిగిందన్నారు. 60మందికి (ఎక్స్ రే)తీయడం జరిగినట్లు తెలిపారు..ఈ కార్యకర్మంలో టీబీ సూపర్వైజర్ రహత్,ఎం ఎల్ హెచ్ పి అశ్విని,ఏఎన్ఎం శైలజ తదితరులు ఉన్నారు.

# ఏపీలో రేపటి నుంచి స్పెషాలిటీ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు బంద్..!

బకాయిలు విడుదల చేయాలని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల డిమాండ్.

నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ.3 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్న ప్రభుత్వం.

# వైయస్ఆర్‌సీపీలోకి చేరికలు

తాడేపల్లిగూడెంలో భారీగా జనసేన నుంచి వైయస్ఆర్‌సీపీలోకి చేరికలు

వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో 28, 32 వార్డుల నుండి సుమారు 100 మంది జనసేన కార్యకర్తలు వైయస్ఆర్‌సీపీలో జాయిన్

ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్‌లు మూలపర్తి అర్జునరావు, అఖిల్, నీలం నాగభూషణం, లంకా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# ఏఎస్ఐ చంద్రయ్య పదవి విరమణ వేడుకలు

- పాల్గొన్న జిల్లా ఎస్పీ స్నేహా మేహ్రా




**వికారాబాద్, మార్చ్,31(సమయం న్యూస్) :** "38 ఏళ్ల నిష్కళంక సేవలు అభినందనీయం: ఏఎస్ఐ చంద్రయ్య పదవీ విరమణ వేడుకలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్"ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తూ,మంగళవారం పదవీ విరమణ పొందిన జి. చంద్రయ్య కు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై, చంద్రయ్య ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుదీర్ఘంగా 38 సంవత్సరాలకు పైగా పోలీస్ శాఖలో అంకితభావంతో సేవలు అందించిన చంద్రయ్య కృషి ఎంతో అభినందనీయమని కొనియాడారు. పోలీస్ విభాగంలో ఎలాంటి రిమార్క్ లేకుండా, క్రమశిక్షణతో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించడం అనేది చాలా కఠినమైన విషయమని, అది కేవలం వృత్తి పట్ల నిబద్ధత ఉన్నవారికే సాధ్యమని ఆమె పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చొరవను ఆదర్శంగా తీసుకోవాలని తోటి సిబ్బందికి సూచించారు. ఇకపై ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పూర్తి ఆరోగ్యంతో, ప్రశాంతమైన జీవనం గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు వేడుకలో ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఉమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ సరోజా, ఆర్ఐ శ్రీశైలం, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ తో పాటు పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్సై లు మరియు డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతా అవినీతి పుట్ట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతికి కేరాఫ్ గా మారినట్లు చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సామాజిక తనిఖీలో బహిర్గతమైంది..

సుమారు 20 కోట్ల పనులు 2024- 25 లో నిర్వహించగా రెండు కోట్లకు పైగా గోల్మాల్ జరిగినట్లు తనిఖీ అధికారులు గుర్తించారు.. అయితే సామాజిక తనిఖీ గ్రామసభ లో మాత్రం కేవలం 5 లక్షలే లెక్క చూపాల్సినవిగా తేల్చారు. తనిఖీలు నిర్వహించిన డిఆర్పి,సిఆర్పిలు వారి తనిఖీల్లో ఎంత గోల్ మాల్ జరిగిందో కూడా బయటకు చెప్పకుండా గుట్టుగా ఉంచుతున్నారు.. ఎంత అవినీతి జరిగిందో చెప్పాలని విలేకరులు ఫోన్లు చేసిన స్పందించని సి ఆర్ పి,డి అర్ పి లు పలు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో కూలీలు పనికి రాకుండానే మస్తర్లు వేయడం, మొక్కలు నాటకుండానే బిల్లులు చేయడం, పంట కుంటలు తవ్వకుండానే మస్తర్లు వేసేయడం ఇలా పలు రకాల అవినీతి బట్టబయలైంది.. తనిఖీల్లో బయటపడ్డ అవినీతిని కప్పిపుచ్చేందుకు నగదు చేతులు మారినట్లు సమాచారం..ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటేనే చింతలపూడి ఉపాధి హామీ పనుల్లో జరిగిన పూర్తి అవినీతి బయటపడే అవకాశం ఉంది

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి దిశానిర్దేశం
- కందకుర్తి పుష్కరఘాట్ సందర్శన



**నిజామాబాద్, మార్చి 31 :( సమయం న్యూస్)** వచ్చే ఏడాది జూలైలో అట్టహాసంగా జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం కూడా ఈ పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు పురమాయించిన పనులను వారు ఏమేరకు చేపట్టారు అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పుష్కర ఘాట్ కు వచ్చే మార్గాలలో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. గోదావరి పుష్కరాలకు త్రివేణి సంగమ ప్రాంతం అయినందున ఈ ఘాట్ వద్ద పుణ్య స్నానాల కోసం ప్రముఖులతో పాటు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ఆయా మార్గాలలో అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణాలు సైతం చేపట్టాలన్నారు. వి.వి.ఐ.పీల కోసం హెలిప్యాడ్ ను నిర్మించాలని, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ కందకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెంజల్ మండల అధికారులతో సమావేశం అయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనాభా గణన ప్రక్రియల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహసిల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన గ్రామ సర్పంచ్

**--విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం**



**మద్దూర్ మండలం, మార్చి31(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి గ్రామ సర్పంచ్ సాయప్ప,ఉప సర్పంచ్ సి.భీమమ్మ మరియు గ్రామ కార్యదర్శి యండి.షాజిల్ భోజనం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులతో కలిసి మాట్లాడి భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ,విద్యార్థులకు ప్రతిరోజూ శుభ్రంగా,పోషకాహారం కలిగిన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.ఆహారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.వంటగది పరిశుభ్రత,ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారికి అందుతున్న ఆహారం నాణ్యతపై ప్రత్యక్షంగా అవగాహన పొందామని తెలిపారు.భవిష్యత్తులో కూడా పాఠశాలలో అన్ని సౌకర్యాలు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఖాజీపూర్ గ్రామ పాఠశాల సిబ్బంది,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బీ ఆర్,అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.




**నారాయణపేట, మార్చ్,31(సమయం న్యూస్):** స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని, అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.ఏప్రిల్ 5 న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, 14 న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గతేడాది జయంతి వేడుకలను ఎలా నిర్వహించారో.. ఈ సారి అలాగే నిర్వహించాలని ఏర్పాట్లలో ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ పరంగా అధికారికంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఈ నెల 5 న జిల్లా కలెక్టరేట్ లోనే నిర్వహిస్తామని, 14 న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ జయంతిని జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ చౌరస్తా లో నిర్వహించడం జరుగుతుందని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ జిల్లా కలెక్టర్ కు తెలిపారు.కాగా సమావేశంలో పాల్గొన్న పలువురు దళిత సంఘాల సభ్యులు మాట్లాడుతూ..జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరారు. గతంలో విగ్రహ ఏర్పాటు కు మున్సిపల్ లో కౌన్సిల్ తీర్మానం కూడా చేయడం జరిగిందని వారు తెలపగా, పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని మరి కొందరు సభ్యులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు, ప్రభుత్వ అనుమతులతో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం అని కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ప్రతి ఏటా అంబేద్కర్ జయంతి తర్వాత జిల్లా కేంద్రంలో అంబేద్కర్ జాతర ను కూడా అట్టహాసంగా నిర్వహిస్తామని, అంబేద్కర్ జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే జాతరకు ప్రభుత్వ పరంగా ఏదైనా ఆర్థిక సహాయం అందించాలని అంబేద్కర్ జాతర కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ ను కోరారు.షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ పరంగా అంబేద్కర్ జాతర కు ఎలాంటి నిధుల ప్రొవిజన్ లేదని, జయంతిని మాత్రమే ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించడం జరుగుతూ వస్తుందని ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్ కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి,శ్రీను, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం. ఏ. రషీద్, కౌన్సిలర్ మహేష్, జయశ్రీ, దళిత సంఘాల సభ్యులు శరణప్ప, ఈశ్వరమ్మ, మహా దేవ్ పాల్గొన్నారు.

## తాండూర్ మున్సిపాలిటీ యందు చికెన్, మటన్,ఫిష్ వ్యర్థాలను సేకరించుటకు

● మరియు స్లాటర్ హౌస్ బహిరంగ వేలం వేయుటకు మున్సిపల్ నిర్ణయం

● తాండూర్ మున్సిపల్ కమిషనర్ కె. మధుసూదన్ రెడ్డి



**తాండూర్ మున్సిపల్, మార్చ్,31(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపాలిటీ యందు చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించుటకు మరియు స్లాటర్ హౌస్ బహిరంగ వేలం నిర్వహించుటకు మున్సిపల్ అధికారులు నిర్ణహించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.ఏప్రిల్ 7 ఉదయం11 గంటలకు చికెన్,మటన్, ఫిష్ వ్యర్థాల రవాణా,12 గంటలకు స్లాటర్ హౌస్ బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... నిబంధన మేరకు ఈనెల 6వ తేదీన సాయంత్రం నాలుగు గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

● రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో దిశా నిర్దేశం



**నిజామాబాద్, మార్చి 31 ( సమయం న్యూస్). :** రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరుగగా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హాజరయ్యారు. నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న 55 బ్లాక్ స్పాట్ ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత ఇసుక లోడ్ తో కూడిన వాహనాలు తిరగకుండా నిఘా ఉంచాలన్నారు. స్కూల్ బస్సుల తనిఖీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి వాహనం తగిన ఫిట్ నెస్ కలిగి ఉండాలన్నారు. వరి కోతల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఓవర్ లోడ్ తో వెళ్ళే వాహనాలను నియంత్రించేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. అతి వేగం, తాగి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు అంకితభావంతో కృషి చేస్తూ నిజామాబాద్ ను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఈఓ అశోక్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, డీటీఓ ఉమా మహేశ్వరరావు, డీఈఓ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి సమిష్టి కృషి

● జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్, సీపీ వెల్లడి




**నిజామాబాద్, మార్చి 31( సమయం న్యూస్).** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై గట్టి నిఘా కొనసాగించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, వాటి నిరోధానికి అవలంభించాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్, సీపీ దిశానిర్దేశం చేశారు. గడిచిన రెండు మాసాలలో జిల్లాలో ఎక్సైజ్, పోలీస్ శాఖల అధ్వర్యంలో నిర్వహించిన దాడులు, పట్టుబడిన గంజాయి, అల్ప్రాజోలం ఇతర మత్తు పదార్థాలు, నమోదైన కేసుల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కమిటీగా ఏర్పడి పక్కాగా కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలను చైతన్యపరచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ప్రహరీ క్లబ్స్, యాంటీ డ్రగ్ కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలన్నారు. కొంతమంది గర్భిణీ మహిళలు సైతం క్లోరోఫాం, డైజోఫాం, అల్ప్రాజోలం వంటి హానికారకమైన పదార్థాలను వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తున్నట్లు సమాచారం ఉందని, ఇది వారి ఆరోగ్యాన్ని దెబ్బ తీయడంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం పై కూడా తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గర్భిణీ స్త్రీలు కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అంగన్వాడి కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో సైతం మత్తు పదార్థాల గురించి ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. ప్రధాన రహదారుల పక్కన దాభాలలో విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. తద్వారా ఓపీఎం (నల్లమందు) వంటి వాటి వినియోగాన్ని గుర్తించి నియంత్రించవచ్చని సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చూడాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను రవాణా చేసే వారిని, వాటిని విక్రయిస్తున్న వారిని, వాటిని వినియోగిస్తున్న వారిని పక్కాగా గుర్తిస్తూ గట్టి నిఘా కొనసాగిస్తున్నామని పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య తెలిపారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశామని, ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు కూడా ఫోన్ చేసి తెలియజేయవచ్చని సీ.పీ సూచించారు. మత్తును కలుగజేసే ఔషధాలు పక్కదారి పట్టకుండా, వాటి వినియోగం పై కూడా పర్యవేక్షణ జరపాలని జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల దూరం లోపు సిగరెట్లు, గుట్కాలు వంటి విక్రయాలు జరుగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఈఓ అశోక్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల,.డీటీఓ ఉమా మహేశ్వరరావు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డీడబ్ల్యూఓ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి

**-- పాఠశాల, అంగన్వాడి కేంద్రాలపై కలెక్టర్ సమగ్ర పరిశీలన**



**సంగారెడ్డి, మార్చి 31( సమయం న్యూస్). :** జిల్లాలో విద్యా మరియు శిశు సంక్షేమ సేవల అమలు పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం కొండాపూర్ మండలం గుంత పల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి వసతులు, సేవల నాణ్యతపై సమగ్రంగా పరిశీలించారు.మొదట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, తరగతి గదుల పరిస్థితి, పరిశుభ్రత, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాల పరిసరాలు, కాంపౌండ్ వాల్ వంటి మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగుందని విద్యార్థులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, ప్రతి విద్యార్థి చదువు పై దృష్టి పెట్టాలని సూచించారు.తదుపరి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని వంటగది, పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు గుడ్డు మరియు ఇతర పౌష్టికాహారం అందుతున్నదా అని ఆరా తీశారు. చిన్నారుల శారీరక మరియు మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సరైన మోతాదులో పోషకాహారం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగునీరు, చల్లని వాతావరణం కల్పించాలని తెలిపారు.అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్, ఇండ్ల ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.పిమ్మట మోనిన్ పరిశ్రమను సందర్శించి పరిశీలించిన కలెక్టర్ పరిశ్రమలో అమలవుతున్న భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, సర్పంచ్ అనంతరెడ్డి, హౌసింగ్ ఏఈ,తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● కోస్గి సీఐ సైదులు

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు

● “Arrive Alive”మూడవ విడత కార్యక్రమంలో భాగంగా...

**కొత్తపల్లి మండలం, మార్చ్,31(సమయం న్యూస్) :** రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రాణ నష్టాలను తగ్గించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీసు శాఖ చేపట్టిన ‘ఆతీతీఅజవ ‘ఆశ్రీఅజవ’ మూడో విడత కార్యక్రమంలో భాగంగా మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు మరియు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కోస్గి సీఐ సైదులు, ఎస్సై విజయ్ కుమార్ లు మాట్లాడుతూ... వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో తలకు గాయాలు తగిలి ప్రాణాలను రక్షించుకోవచ్చని చెప్పారు. వెనుక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం అంతే ముఖ్యమని సూచించారు.అలాగే, మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల భద్రత దృష్ట్యా రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణాన్ని అలవాటు చేసుకోవాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు, వాహనదారులు పాల్గొన్నారు.

# అతివల ఉచిత బస్ ప్రయాణంతో అభివృద్ధి దిశగా ఆర్టీసీ

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి
- 290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు.
- 10 వేల కోట్లు మహిళలకు అదా...



**మొక్తల్ మున్సిపల్,(మం)మార్చ్,31(సమయం న్యూస్):** రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రారంభించిన తొలి పథకం మహాలక్ష్మి పథకమే అని,ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేసిన వెంటనే మహిళలకు ఉచిత ప్రయాణ బస్ ను సీఎం ప్రారంభించారని, 2023 డిసెంబర్ 3 న రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 290 కోట్లకు పైగా మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయడంతో రూ. 10 వేల కోట్లకు పైగా అదా అయిందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 290 కోట్ల మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించిన సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మక్తల్ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మంత్రికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మహిళల గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఉచిత బస్ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. పుట్టింటికి వెళ్ళాలంటే భర్త, కొడుకు తో మహిళలు డబ్బు అడిగే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మహిళలు నయా పైసా ఖర్చు పెట్టకుండా రాష్ట్రంలో ఏ పుణ్యక్షేత్రానికైనా వెళ్లి రావచ్చని, విద్యార్థినిలు, యువతులు పాఠశాలల,కళాశాలకు వెళ్లవచ్చనీ ఆయన స్పష్టం చేశారు. గతంలో ఆర్టీసీ కార్మికులు 56 రోజుల పాటు నిరసన చేసినా, 50 మంది కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని మంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ నీ ఆదుకోవాలని, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని సీఎం సంకల్పిశీచి మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో నాడు నష్టాల్లో ఉన్న ఆర్టీసీ నేడు ఆదాయం దిశగా దూసుకెళ్తోందని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం చేసిన మహిళల డబ్బు ప్రభుత్వమే చెల్లించి ఆర్టీసీ కి జీవం పోసిందని స్పష్టం చేశారు. నారాయణపేట లో ఇప్పటివరకు 123 కోట్లు ప్రభుత్వం ఆర్టీసీ కి చెల్లించిందని వెల్లడించారు. దీంతో నారాయణ పేట జిల్లా మహిళలు రోజుకు 12 లక్షలు ఆదా చేసుకున్నట్లు మంత్రి తెలిపారు.ప్రభుత్వం డబ్బు చెల్లించడం ద్వారా ఆర్టీసీ ని బతికించుకోగలిగామ న్నారు. ప్రతిపక్షాలు ఉచిత బస్సు పై అవహేళన గా మాట్లాడుతున్నాయని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు చాలా డబ్బు ఆదా చేసుకున్నారని మంత్రి తెలియజేశారు.నిజం గడప దాటక ముందే అబద్ధం ఊరు తిరిగి వస్తుందని ప్రతిపక్షాలనుద్యేశించి ఎద్దేవా చేశారు.ఇంటిని నడిపే శక్తి ఉన్న మహిళలు దేనినైనా సాధించగలరని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు,పెట్రోల్ బంక్ ల నిర్వహణ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆర్టీసీ బస్సులను కొనుగోలుకు జిల్లాలోని 11 మండలాల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం 30 లక్షల చొప్పున రుణాలు ఇచ్చిందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉందని, జిల్లాలో మహిళల భద్రత, గౌరవాన్ని కాపాడే బాధ్యత జిల్లా అధికారులపై ఉందని తెలిపారు. మహిళలను గౌరవిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నారని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చాక వరి ని సిరి చేశామన్నారు. సన్న బియ్యం పండించిన రైతులకు మద్దతు ధర ఇవ్వడం తో పాటు బోనస్ ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. వాటిని సన్న బియ్యం గా మార్చి రేషన్ షాపుల ద్వారా ప్రతీ పేద వాడికి ఆరు కిలోల చొప్పున ఇస్తున్నామని గుర్తు చేశారు. చివరగా మక్తల్ నియోజకవర్గంలో తారు రోడ్డు లేని ఊరు అంటూ ఉండదని, అలాగే రోడ్డు ఉన్న ప్రతీ ఊరికి ఆర్టీసీ బస్సునునడిపించాలని, ముఖ్యంగా పాఠశాలల సమయానికి ఆయా గ్రామాలకు బస్సులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య కు మంత్రి సూచించారు. మక్తల్ నియోజక వర్గ కేంద్రంలో రూ.5 కోట్లతో నూతనంగా ఆర్టీసీ బస్ స్టాండ్ ను ఏర్పాటు చేసుకుందాం అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి గొప్ప పథకం అన్నారు. మహిళల చేతుల్లోనే డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ పథకంతో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల కోట్లు ఆదా అయిందన్నారు.మహిళల ఉచిత బస్ ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కొత్త కొత్త పథకాలు తీసుకువచ్చే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ మొగులప్ప, మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మా రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు విమర్శించే స్థాయి నీది కాదు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- మైనింగ్, భూముల వివాదాలపై వివరణ



**పటాన్‌చెరు ,మార్చి 31(సమయం న్యూస్ ):**పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రత్యర్థి నాయకుడు కాటా శ్రీనివాస్ గౌడ్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీష్ రావును విమర్శించే స్థాయి నీదా అంటూ ప్రశ్నించిన ఆయన, అభివృద్ధి నినాదం తమదైతే అవినీతి చరిత్ర ప్రత్యర్థిదని వ్యాఖ్యానించారు.మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గట్టి తీర్పు ఇచ్చినా కూడా బుద్ధి రాలేదని విమర్శించిన ఎమ్మెల్యే, మంత్రి కుమార్తె వివాహ ఖర్చుల పేరుతో కోట్ల రూపాయల వసూళ్లు జరిగాయన్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొంత కుటుంబాన్ని ద్రోహం చేసిన చరిత్ర ఉందని, స్వార్థ ప్రయోజనాల కోసం కన్న తల్లిని కూడా పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించారని ఆరోపించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని డబ్బుకు అమ్ముకున్నారని, ఎన్నికల సమయంలో బీఫాంలను రేట్లు పెట్టి విక్రయించడం అలవాటుగా మారిందని తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గల్లీలో కలెక్షన్ ఏజెంట్లను పెట్టి వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు చేశారు. గత రెండున్నర సంవత్సరాల వసూళ్ల చిట్టాను బయటపెట్టాలని సవాల్ విసిరారు.అమీన్ పూర్ సర్పంచ్‌గా ప్రజలు గెలిపించినప్పటికీ పూర్తి కాలం పనిచేయలేక పదవి నుంచి తొలగించబడ్డారని గుర్తు చేస్తూ, ఒక సర్పంచ్ పదవినే పూర్తి చేయలేని అసమర్థుడు అంటూ కాటా శ్రీనివాస్ గౌడ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలను ఖండించిన ఎమ్మెల్యే, గజం భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే బహిరంగ విచారణకు సిద్ధమని ప్రకటించారు.

**మైనింగ్ కేసులపై వివరణ....**2012లో పటాన్‌చెరు మండలంలోని లకడారం గ్రామంలో సర్వే నంబర్ 738లో "సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ సప్లై" పేరిట ప్రభుత్వం జారీ చేసిన చీశీ.439/ఘా/2010 ప్రొసీడింగ్స్ ప్రకారం 15 సంవత్సరాల లీజుతో క్వారీ ప్రారంభించామని తెలిపారు. ఆ ప్రాంతంలో అప్పటికే ప్రోగ్రెసివ్ కన్స్ట్రక్షన్ సంస్థ జాతీయ రహదారి నిర్మాణం కోసం మైనింగ్ చేపట్టిన విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా క్వారీని నిర్వహించామని వివరించారు. 2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 2024లో రాజకీయ కక్షతో తమ క్వారీపై చర్యలు తీసుకుని, అనుమతికి మించి మైనింగ్ చేస్తున్నారంటూ సీజ్ చేశారని ఆరోపించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 520 క్వారీలకు నోటీసులు ఇచ్చినప్పటికీ తమ క్వారీపై ప్రత్యేక లక్ష్యంతో 300 కోట్ల జరిమానా విధించారని విమర్శించారు. ఈ అంశంపై రీ-సర్వే చేయాలని హైకోర్టు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు.

**పోచారం భూములపై స్పష్టత....**పటాన్‌చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం సర్వే నంబర్ 62లోని 5 ఎకరాల భూమి 1974లో స్వాతంత్ర సమరయోధుడు వెంకటేశ్వర్లుకు కేటాయించబడిందని, 1997లో శంకర్ లాల్‌కు విక్రయించబడిందని, 1998 నుంచి ఇతరులకు బదిలీ అయిందని వివరించారు. ఈ భూమికి తమ కుటుంబంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.ఇకపై ఈ అంశంపై తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.

# రసాయన శాస్త్రంలో విస్తరణోపన్యాసం

- "డీటైల్డ్ స్టడీ ఆన్ ఫార్మకోకైనెటిక్స్ ఇన్ మెడిసినల్ కెమిస్ట్రీ"
- అంశంపై ప్రసంగించిన జిల్లా రసాయన శస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్-డా.ఎ. సంతోషి
- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన...




**కొడంగల్ మున్సిపల్, మార్చ్,31(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల లో మంగళవారం కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన బి. ఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థులకు "డిటైల్డ్ స్టడీ ఆన్ ఫార్మకోకైనెటిక్స్ ఇన్ మెడిసినల్ కెమిస్ట్రీ" అను అంశంపై విస్తరణోపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తగా ప్రభుత్వ డీగ్రీ కళాశాల వికారాబాద్ కు చెందిన రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎ. సంతోషి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా ఒక రసాయనాన్ని తక్కువ మోతాదులో శరీరానికి అందించినపుడు అది ఔషదంగా పనిచేస్తుందన్నారు. ఇంకా ఔషధ లక్షణాలు, ఔషధాన్ని శరీరంలోకి పంపించే వివిధ మార్గాలు, ఫార్మసీలో ఔషధాల మోతాదు,ఫార్మకోఫోర్, ఫార్మకోకైనటిక్స్-శోషణ, పంపిణీ, జీవక్రియ, ఔషధాల విసర్జన-విధానం, ఫార్మకోడైనమిక్స్,టాక్సికాలజీ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రసాయన శాస్త్ర విద్యార్థులకు ఎంతో భవిష్యత్తు ఉందని, వారికి ఫార్మా, మెటలర్జీ, పెట్రోకెమికల్, ఆహార శుద్ధి, క్వాలిటీ మేనేజ్మెంట్, పర్యావరణ రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని, విద్యార్థులు పట్టుదలతో చదివి వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఆర్. శ్రీనివాస్, యం. హరిప్రియ, డా. వి. శ్రీధర్ కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలకు ఎంపికైన 11మంది నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు

- విద్యార్థులకు సన్మానించిన స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్. డి.వి నరేష్ రాజ్...








**కొడంగల్ మున్సిపల్, మార్చ్,31(సమయం న్యూస్) :** గురుకుల పాఠశాలకు ఎంపికైన నవీన ఆదర్శ హైస్కూల్ (11)మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఘనంగా సత్కరించారు.. గురుకుల పాఠశాలకు ఎంపికైన నవీన ఆదర్శ స్కూల్ నాలుగో తరగతి శిరీష, రిర్షిత్, సాయిచరణ్ ,సృజన్,హారిక, వరుణ్, అభిరామ్, నరేష్ గౌడ్, రాజవర్ధన్ రెడ్డి,ప్రేమ్ రాథోడ్,వెంకటేష్ రాథోడ్ ,విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పాఠశాల ఫౌండర్ లక్ష్మీ వెంకటయ్య ,ప్రిన్సిపాల్ డి.వి నరేష్ రాజ్ ,వైస్ ప్రిన్సిపల్ సంతోష,ఉపాధ్యాయుల బృందం ఘనంగా శాలువతో సన్మానించారు అలాగే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అభినందించారు.

# చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

- పోలీసు,రెవిన్యూ అధికారులు.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట, మార్చ్,31(సమయం న్యూస్) :** ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుంది అని నారాయణపేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు.కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు.పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యశీగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.

# వేసవి కాలంలో త్రాగునీటి సమస్యల నివారణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మార్చ్,31(సమయం న్యూస్) :** వేసవి కాలంలో త్రాగునీటి సమస్యల నివారణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారము సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం లో కంట్రోల్ రూమ్ నెం.08416-235291 కు కాల్ చేయవచ్చని,వేసవి కాలంలో త్రాగునీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ నేపథ్యంలో త్రాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడినదని , ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 వరకు పై నెంబర్ సంప్రదించాలని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలు తమ ప్రాంతాల్లో త్రాగునీటి కొరత, పైప్‌లైన్ లీకేజీలు, ట్యాంకర్ సరఫరా లోపాలు వంటి సమస్యలను తెలియజేయవచ్చు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమములో ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, జడ్ పి సి ఇ ఓ సుదీర్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ , ఇ ఇ రవి కుమార్ తదితరులు ఉన్నారు.

## ఉపకార వేతనాల బకాయిలను చెల్లించాలని సీఎం దిష్టిబొమ్మ దగ్ధం



**ఖమ్మం , మార్చి 31 : ( సమయం న్యూస్ ) :** పెండింగ్ లోఉన్న ఉపకార వేతనాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ( అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ) ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ సమీపంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు బెల్లంకొండ అజయ్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యారంగ నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి , గ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించక విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. దేశంలో ఎన్నడూ ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ , వృత్తి విద్య కళాశాలలు రెండుసార్లు తరగతులకు తాళాలు వేసిన దుస్థితి నెలకొందన్నారు. పెండింగ్లో ఉన్న 12000 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో రాష్ట్రంలో మంత్రులు ఎమ్మెల్యేలు ఎక్కడ తిరగకుండా ఎక్కడపడితే అక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. రాష్ట్ర కార్య సమితి సభ్యులు చావా ప్రణీత్ ,ఖమ్మం నగర కార్యదర్శి కార్తీక్, భద్రాచలం నగర కార్యదర్శి మండల గురు సాయి,ఖమ్మం నగర టెక్నికల్ సెల్ కన్వీనర్ సోమనబోయిన మదన్ ,ఖమ్మం నగర ఎస్ ఎఫ్ డి కన్వీనర్ సాయిచరణ్ ,మానుకోట నగర కార్యదర్శి చాణిక్య ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం

- తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూర్, మున్సిపల్, మార్చ్,31(సమయం న్యూస్) :** మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో దాదాపు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ. 10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా మహిళామణులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. ఈ సందర్భంగా తాండూర్ ఆర్టీసీ డీఎం సురేష్ కుమార్ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని తెలిపారు. బస్సు సర్వీసులు సరిపోవడం లేదని ప్రభుత్వం దృష్టికి రావడంతో మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇస్తూ, ఆర్టీసీతో సమన్వయం చేసి కొత్త బస్సులను ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ ఉచిత బస్సు ప్రయాణం వల్ల అనేక నిరుపేద మహిళలకు ఎంతో లాభదాయకంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు,మాజీ డీసీసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ గౌడ్, కర్ణం పురుషోత్తం, ప్రభాకర్ గౌడ్ తో పాటు పట్టణ కౌన్సిలర్స్, నాయకులు పలువురు పాల్గొన్నారు

## శ్రీ బాకరం ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా

- భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా
- చెట్లను,రోడ్డును చదును చేయించిన సర్పంచ్ సీహెచ్ శివయ్య



**యాలాల మండలం, మార్చ్,31(సమయం న్యూస్) :** హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే శ్రీ బాకారం అంజనేయ స్వామి జాతర సందర్భంగా( ఏప్రిల్ 1 నుండి 3 వరకు) యాలాల ప్రధాన రహదారి నుండి దేవాలయం వరకు ఉన్న రోడ్డు మార్గాన్ని భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా యాలాల గ్రామ సర్పంచ్ సీహెచ్ శివయ్య ఆధ్వర్యంలో జేసీబీ తో రోడ్డు మార్గం పక్కల చెట్లను మరియు రోడ్డును చదును చేయడం జరిగింది. ఏఎంసి డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్, 6వ వార్డ్ నెంబర్ యూ. శేఖర్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య,హన్మంతు,రాజు రెడ్డి,రాజు టెంట్ హౌస్,సందీప్, ఎం. శివ కూమర్ తదితరులు పాల్గొన్నారు

## మిత్రుని కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం

**చేవెళ్ల, మార్చ్ 31 ( సమయం న్యూస్):** చేవెళ్ల మండలం అల్లాడ గ్రామనికి చెందిన శివగల యాదయ్య మానసిక ఒత్తిడితో ఇటీవల కాలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుని కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకు వచ్చిన తోటి విద్యార్థులు స్నేహం అన్న మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు , తోటి పూర్వ విద్యార్థి మిత్రులువిషయం తెలుసుకున్న 2011-12 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు తమవంతుగా మిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. ఈ నేపథ్యంలో మిత్రులంతా కలిసి రూ. 12,500 సేకరించి, మంగళవారం మృతుని దశదినకర్మ రోజు మృతుని తల్లి నీలమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితమిత్ర యువజన సంఘం గ్రామ ఇంచార్జ్ శివగాళ్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు పానుగంటి ప్రవీణ్, శివగాళ్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లవాడ గ్రామ 5వ వార్డ్ మెంబర్ శివగల్ల సత్యానందం పాల్గొన్నారు. మిత్రుని కుటుంబానికి సహాయం చేయడానికి ముందుకొచ్చిన మిత్రులను మృతుని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అభినందించారు.



## ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహణ

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలి
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు,
- గ్రామసభ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన డిప్యూటీ సిఎం




**నారాయణపేట, మార్చ్,31(సమయం న్యూస్) :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ, వార్డుసభల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు,ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియోసమావేశానికి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే రీతిన ఉండాలని, గ్రామ సభలకు వార్డు మెంబర్ నుంచి ఎంపీ, మంత్రుల వరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు. గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల చేత గ్రామ సభలలో మాట్లాడించాలని అన్నారు. జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతో పాటు, పాలు, రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. సాంస్కృతిక శాఖ కళాకారులను ఉపయోగిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు. గ్రామాలకు ప్రభుత్వం భారీ ఎత్తున విడుదల చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు



కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. సీఎస్ కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ,ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని,అదే స్ఫూర్తితో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి అనే అంశంపై రిపోర్టు అందించాలని కలెక్టర్ లను ఆదేశించారు. గ్రామ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని, స్థానిక ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలో ఉండాలని అన్నారు. గ్రామ సభలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియ జేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్బహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించి, నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫణీంద్ర రెడ్డి, శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు......

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**రాయపోల్, మార్చి 31:** సీఎంఆర్ఎఫ్ సహాయనిధి నిరుపేదలకు వరంగా నిలుస్తోందని దుబ్బాక బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం ఎలుకల్ గ్రామానికి చెందిన జల రమేష్కు రూ. 60,000 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును దుబ్బాకలో మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తక్షణ సహాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిరంజీవి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాపని వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చాందా-టి గ్రామంలో 'సాయి వినాయక ఇండస్ట్రీస్' ప్రారంభం

- PMEGP పథకం కింద యూనిట్ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ మార్చి31( సమయం న్యూస్). :** ఆదిలాబాద్ గ్రామీణ మండలం చాందా-టి గ్రామంలో ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 'సాయి వినాయక ఇండస్ట్రీస్' యూనిట్ను మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. రిబ్బన్ కత్తిరించి పరిశ్రమను అధికారికంగా ప్రారంభించారు. పారిశ్రామికవేత్త రాజ్ కుమార్ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ యూనిట్కు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రామ్నగర్ శాఖ ఆర్థిక సహాయం అందించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. ావీజు+ూ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. యువత ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీబీ బ్రాంచ్ మేనేజర్ మధుసుధన్, సీనియర్ మేనేజర్అరుణ్ కుమార్, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



# పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్‌గా శీతల్

**ఢిల్లీ :** భారత యువ పారా ఆర్చర్ శీతల్ దేవీకి అరుదైన గుర్తింపు దక్కింది. 19 ఏండ్ల ఈ జమ్మూకశ్మీర్ అమ్మాయి 2025 సంవత్సరానికి గాను 'పారా ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైనట్టు వరల్డ్ ఆర్చరీ ప్రకటించింది. నిరుడు గ్వాంగ్జూలో జరిగిన వరల్డ్ పారా ఆర్చరీ చాంపియన్‌సిప్‌లో స్వర్ణం గెలిచిన మొదటి మహిళా ఆర్మ్‌లెస్ (చేతుల్లేని) ఆర్చర్‌గా రికార్డులకెక్కిన ఆమె నిలకడగా రాణిస్తుండటంతో వరల్డ్ ఆర్చరీ శీతల్‌కు ఈ అవార్డును ప్రకటించింది. వరల్డ్ చాంపియన్‌లో స్వర్ణమే గాక శీతల్.. పారిస్ పారాలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లోనే మహిళల టీమ్ సిల్వర్, మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో సత్తాచాటింది. ఇక 'ఆర్చర్ ఆఫ్ ది ఇయర్'గా టర్కీకి చెందిన ఎమిర్కన్ హేనీ ఎంపికైంది.



# ప్రీతి, దీపక్ శుభారంభం

**ఢిల్లీ :** సోమవారం నుంచి మంగోలియాలో ప్రారంభమైన ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత బాక్సర్లు శుభారంభం చేశారు. యువ బాక్సర్ ప్రీతి పవార్‌తో పాటు దీపక్ తొలి రౌండ్ బౌట్‌లో తమ ప్రత్యర్థులను చిత్తుచేసి విజయాలతో రెండో రౌండ్‌కు ముందంజవేశారు. మహిళల 54 కిలోల విభాగంలో ప్రీతి.. 5-0తో కజకిస్థాన్ బాక్సర్ ఎలీనా బజరోవను చిత్తుచేసి ఏకపక్ష విజయం సాధించింది. పురుషుల 70 కిలోల విభాగంలో దీపక్.. 3-2తో ఖవస్బెక్ అసదుల్లెవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు.




# టైటాన్స్‌పై పంజాబ్!

## అరంగేట్రంలోనే అదరగొట్టిన కూపర్..

### ఆఖరి వరకు ఉత్కంఠ.. మూడు వికెట్ల తేడాతో గెలుపు..




**పంజాబ్, మార్చి 31:** మొదటి వికెట్ త్వరగా పడింది.. ఆ తర్వాత కాసేపటికే కీలక బ్యాటర్లు పెవిలియన్ చేరారు. లక్ష్యం కష్టంగా మారి ఓటమి తప్పదనుకున్నారంతా! కానీ ఆ అరంగేట్ర కుర్రాడికి మాత్రం అదొక్కటే ఇష్టం లేదు. గుజరాత్ బౌలర్ల పాలిట సింహస్వప్నంలా మారి.. ఒంటరి పోరాటంతో పంజాబ్ కింగ్స్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మంగళవారం రాత్రి ముల్లన్‌పూర్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ పై పంజాబ్ కింగ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది.


#### రాణించిన గిల్.. బట్లర్..

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (39).. జోస్ బట్లర్ (39 నాటౌట్) రాణించారు. గ్లెన్ ఫిలిప్స్ (25) కాసేపు మెరుపులు మెరిపించాడు. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ వైశాఖ్ తన అద్భుత బౌలింగ్ తో మూడు వికెట్లు తీసి గుజరాత్ ను గట్టి దెబ్బకొట్టాడు. యజువేంద్ర చాహల్ రెండు వికెట్లు పడగొట్టగా.. మార్కో జాన్సెన్ కు ఒక వికెట్ దక్కింది.

#### కూపర్ శివతాండవం.. ప్రసిద్ధ్ బౌలింగ్ మాయ

163 పరుగుల లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య కేవలం ఏడు పరుగులకే వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన ప్రభ్‌సిమ్రన్ సింగ్ (37).. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18) స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. అయితే గుజరాత్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ వరుస వికెట్లతో పంజాబ్ ను వణికించాడు. నేహల్ వధేరా (3).. శశాంక్ సింగ్ (4).. స్టాయినిస్ (0) తీవ్రంగా నిరాశపరిచారు.సరిగ్గా అప్పుడే క్రీజులో పాతుకుపోయిన కూపర్ కొన్నోలీ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 44 బంతుల్లోనే ఐదు ఫోర్లు.. ఐదు భారీ సిక్సర్లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జాన్సెన్ తొమ్మిది పరుగులు చేసి అవుట్ కాగా.. చివర్లో జేవియర్ బార్ట్‌లెట్ కేవలం ఐదు బంతుల్లోనే పదకొండు పరుగులు చేసి అతనికి అండగా నిలిచాడు. దీంతో మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ కింగ్స్ ఏడు వికెట్లు కోల్పోయి 165 పరుగులు సాధించి లక్ష్యాన్ని చేరుకుంది. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీయగా.. రషీద్ ఖాన్.. వాషింగ్టన్ సుందర్.. అశోక్ శర్మ.. కగిసో రబడ తలా ఒక వికెట్ పడగొట్టారు. మహ్మద్ సిరాజ్ రెండు ఓవర్లలో పదిహేను పరుగులు ఇచ్చి వికెట్లేమీ తీయలేకపోయాడు.









# అయ్యో పాపం..

### ఐపీఎల్ చరిత్రలో అత్యంత నిలకడైన ఆటగాడు సంజు శాంసన్

### సంజు ఖాతాలో చెత్త రికార్డు.. సంజుకు సీఎస్‌కే కలిసి రాలేదా?

**ఢిల్లీ :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత నిలకడైన ఆటగాడిగా పేరు తెచ్చుకున్న టీమిండియా కీపర్ సంజు శాంసన్.. ఐపీఎల్ 2026 వేలానికి ముందు ట్రేడ్ డీల్ ద్వారా రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) నుంచి చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)లోకి చేరాడు. అయితే కొత్త జట్టు సీఎస్‌కేతో ఆరంభం అతడికి కలిసి రాలేదు. తన మాజీ జట్టు రాయల్స్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో సంజు కేవలం 6 పరుగులకే పెవిలియన్ చేరారు. ఆర్ఆర్ బౌలర్ నాంద్రే బర్గర్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్ చివరి బంతికి క్లీన్ బౌల్డ్ అయి అభిమానులను నిరాశకు గురిచేశాడు. దాంతో సంజు ఓ చెత్త రికార్డును ఖాతాలో వేసున్నాడు.

2020 నుంచి 2025 వరకు ప్రతి ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌లలో సంజు శాంసన్ అద్భుతంగా ఆడాడు. ప్రతి మ్యాచ్‌లో అర్ధ శతకం లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేస్తూ ఒక అరుదైన రికార్డును కొనసాగించాడు. కానీ ఐపీఎల్ 2026 మొదటి మ్యాచ్‌లో 6 పరుగులకే అవుట్ అవ్వడంతో ఆ రికార్డుకు తెరపడింది. 2020లో సీఎస్‌కేపై 74 పరుగులు, 2021లో పంజాబ్ కింగ్స్‌పై 119 పరుగులు, 2022లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 55 పరుగులు, 2023లో మరోసారి సన్‌రైజర్స్‌పై 55 పరుగులు, 2024లో లక్నో సూపర్ జెయింట్స్‌పై 82 నాటౌట్, 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 66 పరుగులు చేశాడు.




ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు సంజును రూ.18 కోట్ల భారీ మొత్తానికి సీఎస్‌కే కొనుగోలు చేసింది. యెల్లో జెర్సీలో అతడు ఎలా ఆడతాడో అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అంతేకాదు 2026 టీ20 వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సంజుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ తొలి మ్యాచ్‌లోనే తక్కువ స్కోర్ చేయడంతో అభిమానులు నిరాశ చెందారు. తొలి మ్యాచ్‌లోనే సంజు విఫలం కావడంతో సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. 'సంజుకు చెన్నై సూపర్ కింగ్స్ జెర్సీ కలిసి రాలేదా?' అని కొందరు, 'రాజస్థాన్ రాయల్స్‌లోనే సంజు బాగుండేవాడు' అని మరికొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. త్వరలోనే తిరిగి ఫామ్‌లోకి వచ్చి భారీ ఇన్నింగ్స్ ఆడతాడని చెన్నై అభిమానులు ఆశిస్తున్నారు. సంజుకు ఐపీఎల్‌లో మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు 177 మ్యాచ్‌ల్లో 4704 పరుగులు చేశాడు.

# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ




ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.




## కథనార్‌తో మళ్లీ బలమైన పాత్రలో అనుష్క

### ట్రైలర్ విడుదల చేసిన చిత్రబృందం


టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి 'బాహుబలి' తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'కథనార్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా విడుదలైన 'కథనార్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. 'కథనార్'తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.



## రామాయణ టీజర్ 2న విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బ్జడెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్ రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు. ఇప్పటివరకు చిత్రబృందం కేవలం టైటిల్ వీడియోతో పాటు 3 నిమిషాల 3 సెకన్ల నిడివి గల 'రామాయణ: ది ఇంట్రడక్షన్' అనే క్లిప్‌ను మాత్రమే పంచుకుంది. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో కూడిన ఆ వీడియోలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యష్ లుక్‌లకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను చూపించారు.అయితే ఇప్పుడు రాబోతున్న టీజర్ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ దృశ్యకావ్యం 2026 నవంబర్‌లో దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



## విమర్శలను పట్టించుకోవడం మానేశా

### నిర్మాత కొణిదెల నిహారిక

తాను ఏం చేసినా కొందరు విమర్శిస్తూనే ఉన్నారని, అందుకే అలాంటివారిని పట్టించుకోవడం మానేసినట్లు నిర్మాత నిహారిక చెప్పారు. ఆమె సొంత బ్యానర్‌పై వస్తోన్న చిత్రం 'రాకాస' సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మానస శర్మ దర్శకురాలు. ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీమ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అందులో నిహారిక మాట్లాడుతూ.. నిర్మాతగా కెరీర్ ప్రారంభించగానే ఎన్నో విమర్శలు ఎదు-రయ్యాయని అన్నారు. కమిటీ కుర్రోళ్లుతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశాను. అప్పుడు చాలామంది కామెంట్స్ చేశారు. ఎందుకు చేస్తున్నావు ఇదంతా.. తెలిసిన వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' చేస్తుంటే 'కమిటీ కుర్రోళ్లు' లాంటి కథలు చేయచ్చు కదా.. ఇలాంటి వీఎఫ్ఎక్స్‌లు ఎందుకు అన్నారు. చిన్నచిన్న వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అని మరికొందరు అన్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను. నిర్మాతగా ప్రతి సినిమా నుంచి నేర్చుకుంటూనే ఉన్నాను. కొణిదెల కుటుంబం నాకు ఎంత ముఖ్యమో నా బ్యానర్ పింక్ ఎలిఫెంట్ ఫ్యామిలీ కూడా అంతే ముఖ్యం అని నిహారిక అన్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# జ్ఞానం శక్తి అయితే.. లైబ్రేరియన్లు ఎందుకు నిర్లక్ష్యం చేయబడ్డారు?

**గ్రంథాలయాలు జ్ఞానానికి వెన్నెముక. అవి చరిత్రను సంరక్షిస్తాయి, సమాచారానికి ప్రాప్యతను కల్పిస్తాయి మరియు నేర్చుకోవడానికి, అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి ప్రజలకు సాధనాలను అందిస్తాయి. కానీ ఈ సంస్థల గుండె వద్ద ఉన్న నిపుణులు, గ్రంథపాలకులు (లైబ్రేరియన్లు), సమాచార సంపన్న సమాజాలను రూపొందించడంలో వారు పోషించే కీలక పాత్ర ఉన్నప్పటికీ, తరచుగా నిర్లక్ష్యం చేయబడుతున్నారు, తక్కువ అంచనా వేయబడుతున్నారు. "జ్ఞానమే సర్వస్వం" అని చెప్పుకునే మన సమాజం, ఆ జ్ఞానాన్ని అందించే గ్రంథపాలకులను మాత్రం ఎందుకు మరచిపోతుంది?**

### లైబ్రేరియన్ల నిశ్శబ్ద ప్రభావం.. కనిపించని యోధులు

గ్రంథపాలకులు పుస్తకాలను నిర్వహించడం లేదా రికార్డులను భద్రపరచడం మాత్రమే చేయరు. వారు విద్యార్థులను పరిశోధనలో మార్గనిర్దేశం చేస్తారు. సంక్లిష్ట సమాచార వ్యవస్థలను నావిగేట్ చేయడంలో కమ్యూనిటీలకు సహాయపడతారు, అక్షరాస్యత మరియు విమర్శనాత్మక ఆలోచనను పెంపొందిస్తారు. నేటి డిజిటల్ యుగంలో వారి పాత్ర మరింత కీలకంగా మారింది.

"లైబ్రేరియన్లు విద్యా భాగస్వాములు" అని ఎన్ సి ఈఆర్టీ జర్నల్‌లో ప్రచురితమైన ఒక వ్యాసం వివరిస్తుంది. వారు సమాచార మరియు డిజిటల్ అక్షరాస్యతను బోధిస్తారు, విచారణ-ఆధారిత అభ్యాసాన్ని ప్రోత్సహిస్తారు, బోధన మరియు అభ్యాసం కోసం సాంకేతికతను ఉపయోగించడంలో సహాయపడతారు, చదివే అలవాటును మరియు జీవితకాల అభ్యాసాన్ని పెంపొందిస్తారు. పాఠ్యాంశాల అభివృద్ధిలో వారు కళాశాల నిర్వాహకులు మరియు అధ్యాపకులతో సహకరిస్తారు. ప్రతి విజయవంతమైన విద్యార్థి, పరిశోధకుడు లేదా ప్రొఫెషనల్ తమ సాధనలో కొంత భాగాన్ని గ్రంథపాలకుల మార్గదర్శకత్వానికి రుణపడి ఉంటారు. కానీ వారి సహకారాలు తరచుగా కనిపించవు. "జ్ఞానాన్ని పొందడం ఒక కళ, దానిని అందించడం మరో కళ" - ఈ రెండో కళను ప్రదర్శించేవారే గ్రంథపాలకులు, కానీ వారి కళకు సరైన గుర్తింపు దొరకడం లేదు.



డాక్టర్ సుంకరి రాజారామ్
సెల్:7799910222

**"జ్ఞానానికి విలువ లేని సమాజంలో, జ్ఞాన సంరక్షకులకు విలువ ఉండదు" అనే నానుడి ఇక్కడ నిజమవుతుంది.**

లైబ్రేరియన్లు పుస్తకాలు మరియు అభ్యాసం పట్ల ప్రేమతో పనిచేస్తారని ఒక సాధారణ కథనం ఉంది. అభిరుచి ప్రశంసనీయమే అయినప్పటికీ, అధ్యాపకులతో సమానంగా జీతం ఉన్నప్పటికీ అధికారిక హోదా మాత్రం కరువైంది. ఇప్పటికీ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో గ్రంథ పాలకులను లైబ్రేరియన్లు గానే పరిగణిస్తున్నారు. కానీ, అధ్యాపకులతో సమానంగా అర్హత ఉన్నప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఇప్పటికీ గ్రంథ పాలకులకు అధికారిక హోదా ఉన్నత విద్యాశాఖ ఇంతవరకు ఇవ్వలేదు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఇంకా కూడా కొంతమంది ప్రిన్సిపాల్సు గ్రంథ పాలకులను నాన్ టీచింగ్ సిబ్బందితో సమానంగా చూస్తున్నారు. దేశంలోని అన్ని ఇతర రాష్ట్రాలలో గ్రంథపాలకులను టీచింగ్ సిబ్బంది అనే కాకుండా, అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా అధికారిక హోదా ఉంది.

### ఆధునిక లైబ్రేరియన్లు.. కొత్త సవాళ్లు

"సాంకేతికత మారవచ్చు, కానీ మానవ మార్గదర్శకత్వం యొక్క అవసరం ఎప్పటికీ మారదు" - ఈ మాటను లైబ్రేరియన్లు నిరూపిస్తున్నారు. వారు ఇప్పుడు డిజిటల్ రిసోర్స్‌ల నిర్వాహకులు, డేటా అనలిస్టులు, ఇన్ఫర్మేషన్ ఆర్కిటెక్ట్‌లుగా మారుతున్నారు.

వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్యా సంస్థల బలోపేతం, ఉన్నత విద్య అంతర్జాతీయీకరణ, విద్యార్థులకు నిర్దిష్ట నైపుణ్యాలు మరియు విలువలు, పరిశోధకులు మరియు ఉపాధ్యాయులకు ప్రేరణ, ఉన్నత విద్యలో సమానత్వం మరియు సమగ్రత వంటి 21వ శతాబ్దపు సవాళ్లను లైబ్రరీలు సమర్థవంతంగా ఎదుర్కోగలవు .

### చర్య లేకుండా గౌరవం.. ఖాళీ ప్రశంసల విషాదం

లైబ్రేరియన్లను ప్రత్యేక కార్యక్రమాల సమయంలో గుర్తించవచ్చు, ప్రసంగాలలో ప్రస్తావించవచ్చు, మీడియాలో ప్రశంసించవచ్చు. కానీ ఈ సంజ్ఞలు వారి పని పరిస్థితులను లేదా వృత్తిపరమైన స్థితిని మెరుగుపరచడంలో పెద్దగా సహాయపడవు. ఆచరణాత్మక మద్దతు లేకుండా గుర్తింపు, శిక్షణ అవకాశాలు, కెరీర్ వృద్ధి - ఖాళీగా ఉంటుంది మరియు వారి నిజమైన విలువను ప్రతిబింబించడంలో విఫలమవుతుంది.

### ముందుకు సాగే దారి.. పరిష్కార మార్గాలు

లైబ్రేరియన్ల సమస్యలకు పరిష్కారాలు అనేకం ఉన్నాయి, కానీ వాటిని అమలు చేయడానికి రాజకీయ సంకల్పం అవసరం. జ్ఞానం నిజంగా శక్తి అయితే, లైబ్రేరియన్లు అదృశ్యంగా ఉండకూడదు. వారిని గౌరవించాలి, సాధికారత కల్పించాలి, అభ్యాసం మరియు మేధో వృద్ధికి రూపశిల్పులుగా జరుపుకోవాలి. "ఒక సమాజం యొక్క నాగరికతను దాని లైబ్రరీలు మరియు లైబ్రేరియన్ల పట్ల చూపించే గౌరవంతో కొలవవచ్చు"లి - ఈ మాటను మనం ఎప్పటికీ మరచిపోకూడదు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసే గ్రంథపాలకులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా అధికార హోదా ఇవ్వాలని కోరుతున్నారు. లైబ్రేరియన్ల పట్ల మన నిర్లక్ష్యం, మన స్వంత భవిష్యత్తు పట్ల మనం చూపించే నిర్లక్ష్యం. ఎందుకంటే వారు లేని సమాజం, గతం లేని వ్యక్తి లాంటిది - దారి తెలియని అంధకారంలో సంచరించేవాడు. ఆ అంధకారం నుండి బయటపడాలంటే, జ్ఞాన సంరక్షకులకు న్యాయం చేయాల్సిందే.




# బాసర అభివృద్ధికి కట్టుబడి ఉన్న సర్కారు

**ఆరో తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక.. పటిష్ట ఏర్పాట్లు..**
**గోదావరి పుష్కరాలకు సిద్ధమవుతున్న పుణ్యక్షేత్రం..**
**రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**



**బాసర, మార్చి 31:**

నిర్మల్ జిల్లాలోని బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక.. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర ఆలయానికి రానున్న నేపథ్యంలో.. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వెల్లడించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

### ఆధ్యాత్మిక శోభతో కొత్త నిర్మాణాలు

బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా చారిత్రాత్మక గుర్తింపు ఉందని.. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కమిషనర్ పేర్కొన్నారు. కొత్తగా చేపట్టబోయే నిర్మాణ ప్రాంతాలను.. శంకుస్థాపన స్థలాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సకల వసతులు కల్పించాలని ఆదేశించారు. పనుల ప్రారంభోత్సవాల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

రానున్న గోదావరి పుష్కరాల కోసం బాసరలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు హనుమంతరావు వివరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాత పుష్కర ఘాట్ల మరమ్మతులతో పాటు కొత్త ఘాట్లు నిర్మిస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ఇప్పటి నుండే వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్.. సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్.. ఈవో విజయరామారావు పాల్గొన్నారు.

# మహిళల ప్రగతికి 'మహాలక్ష్మి' భరోసా!

- **పది వేల కోట్లు ఆదా చేసిన మహిళా లోకం..**
- **ఆర్టీసీ బలోపేతానికి ప్రభుత్వం కొత్త ప్రణాళిక..**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**




**హైదరాబాద్, మార్చి 31:**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. డిసెంబర్ 9.. 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని వెల్లడించారు. ఇప్పటి వరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. సుమారు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా.. ఆర్టీసీకి యజమానులుగా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

### బస్సుల నిర్వహణ.. కార్మికుల కృషి

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణిస్తుండగా.. అందులో 40 లక్షల మంది మహిళలే ఉండటం విశేషమని మంత్రి చెప్పారు. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని వివరించారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు.. కండక్టర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు.

### భవిష్యత్తు ప్రణాళికలు.. సంక్షేమం

ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోందని పొన్నం తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని.. అటువంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. కార్మికుల బకాయిలను తీరుస్తున్నామని.. యూనియన్ల ఏర్పాటు.. ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు.

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారం.. బాధితులకు అండ!

**ఇందిరమ్మ ఇళ్లు.. పెన్షన్ల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి..**
**ఆర్టీసీ కార్మికుల విధులకు కమిటీ నిర్ణయమే కీలకం..**
**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, మార్చి 31:**

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితులతో నేరుగా మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని.. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే వినతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి.. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లు.. భూ సమస్యలపై ఆరా

ముఖ్యంగా ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం.. పెన్షన్ల సమస్యలు.. ధరణి ద్వారా భూ రికార్డుల్లో ఉన్న ఇబ్బందులపై ఆయన అధికారులతో చర్చించారు. భూ భారతిలో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా విని.. పరిష్కార దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

### ఆర్టీసీ కార్మికులకు హామీ

ఆర్టీసీలో వివిధ కారణాల వల్ల శాశ్వతంగా ఉద్యోగాలు కోల్పోయిన వారు.. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మంత్రిని కోరారు. వీరి సమస్యను త్రిమెన్ కమిటీ పరిశీలిస్తుందని.. కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి దరఖాస్తుల పురోగతిపై చర్చించారు. పోలీస్ కేసులకు సంబంధించిన ఫిర్యాదులపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

# మీరు వాడుతున్న తేనె స్వచ్ఛమైనదేనా..?




తేనెను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల విటమిన్లు, మినరల్స్, పోషకాలకు తేనె నిలయం. పలు అనారోగ్యాలను తగ్గించడంలో, శరీరానికి శక్తినివ్వడంలో తేనెకు అధిక ప్రాధన్యత ఉంది. ఆయుర్వేదంలోనూ తేనెను పలు ఔషధాలతోపాటుగా ఇస్తారు. అయితే ప్రస్తుత తరుణంలో తేనె వాడకం ఎక్కువవడంతో వ్యాపారులు దాన్ని కూడా కల్తీ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు స్వచ్ఛమైన తేనె ఏదో నకిలీ తేనె ఏదో గుర్తించడం కష్టతరమైంది. అయితే పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను ఇట్టే గుర్తించవచ్చు. దీంతో ఆరోగ్యంపై ప్రభావం పడకుండా జాగ్రత్తగా ఉండవచ్చు.

**నీటిలో కలిపితే..**

మీరు కొన్న తేనె అసలుదో, నకిలీదో గుర్తించాలంటే దాన్ని ఒక టేబుల్ స్పూన్ మోతాదులో తీసుకుని ఒక గ్లాస్ నీటిలో వేయాలి. నకిలీ తేనె అయితే వెంటనే నీటిలో కరుగుతుంది. అసలు తేనె గ్లాస్ అడుగు భాగంలోకి చేరుతుంది. అంతే తప్ప నీటిలో అంత త్వరగా కరగదు. అలాగే ఒక కాటన్ బాల్‌ను తీసుకుని దాన్ని తేనెలో ముంచాలి. అనంతరం దానికి అగ్గిపుల్లతో నిప్పు పెట్టాలి. అసలు తేనె అయితే కాటన్ బాల్ మండుతుంది. నకిలీ తేనె అయితే కాటన్ బాల్ మండదు. అదేవిధంగా ఒక తేనె చుక్కను గోరుపై వేసుకోవాలి. ఆ చుక్క గోరుపై అటు ఇటు కదిలితే అది నకిలీ తేనె అన్నమాట. అదే ఆ చుక్క కదలకుండా స్థిరంగా ఉంటే ఆ తేనెను అసలైందిగా భావించాలి.

**నురగ వచ్చిందంటే..**

ఇక సాధారణంగా మొలాసిస్, మొక్కజొన్న పిండి తదితర పదార్థాలను ఉపయోగించి నకిలీ తేనెను తయారు చేస్తారు. ఈ క్రమంలో నకిలీ తేనెను గుర్తించడం చాలా సులభమే అని చెప్పవచ్చు. కొద్దిగా తేనె తీసుకుని దానికి 2, 3 చుక్కల వెనిగర్ ఎస్సెన్స్ కలపాలి. అనంతరం వాటిని బాగా మిక్స్ చేయాలి. ఇలా వచ్చిన మిశ్రమం ఎక్కువగా నురగను విడుదల చేస్తుంటే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి. ఎందుకంటే నకిలీ తేనె కోసం ఉపయోగించే పదార్థాల్లో చక్కెర కూడా ఉంటుంది. ఇది వెనిగర్‌తో కలిసినప్పుడు నురగలాంటి ద్రవాన్ని ఇస్తుంది. అసలైన తేనె ఇలా నురగను ఇవ్వదు. అలాగే కొద్దిగా తేనెను తీసుకుని బొటనవేలిపై వేయాలి. అనంతరం దాన్ని జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ తేనె చుక్క వేలిపై చుట్టూ విస్తరిస్తే దాన్ని నకిలీ తేనెగా గుర్తించాలి.

**తేనెకు అసలు ఎక్స్‌పైరీ ఉండదు..**

ఇక సాధారణంగా స్వచ్ఛమైన తేనె అయితే అసలు ఎక్స్‌పైరీ ఉండదు. కానీ మనకు మార్కెట్‌లో లభించే తేనెలో కొందరు రసాయనాలు కలుపుతారు. కనుక మనం కొనే తేనెకు ఎక్స్‌పైరీ ఉంటుంది. కానీ సహజసిద్ధంగా కొన్న తేనె అయితే ఎన్ని రోజులు ఉన్నా పాడవదు. రోజులు గడిచే కొద్దీ ఇంకా రుచి పెరుగుతుంది. మార్కెట్‌లో మీరు తేనె కొంటే వీలైనంత వరకు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన తేనె అయితే మంచిది. అది కల్తీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఇలా పలు సూచనలు పాటిస్తే నకిలీ తేనెను గుర్తించడంతోపాటు దాన్ని కొనకుండా జాగ్రత్త పడవచ్చు.

# రోజూ ఒక నారింజ పండు తింటే డిప్రెషన్ తగ్గుతుందా?



నారింజ పండ్లలో అనేక పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల వాటిని సూపర్ ఫుడ్ అంటారు. అవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. నారింజ పండ్లను చర్మానికి కూడా మంచివిగా భావిస్తారు. ఈ ప్రయోజనాలతో పాటు, రోజు నారింజ పండ్ల వినియోగం మానసిక స్థితిని మెరుగుపరుస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రోజూ ఒక నారింజ పండు తినడం వల్ల డిప్రెషన్ ప్రమాదం 20 శాతం తగ్గుతుందని ఇటీవల ఓ అధ్యయనంలో తేలింది.

**మానసిక స్థితి ఎలా మెరుగుపడుతుంది?**

నారింజ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి న్యూరాన్ల సరైన పెరుగుదలకు సహాయపడుతుంది. ఇంకా, ఇది కణాల మధ్య కమ్యూనికేషన్‌ను వేగవంతం చేయడానికి ఒక రక్షణ పొరను ఏర్పరుస్తుంది. విటమిన్ సి మెదడులోని కీలక రసాయనాల స్రావాన్ని నియంత్రిస్తుంది. వాటి ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. ఆరోగ్యకరమైన రక్త నాళాలను నిర్వహించడానికి, మెదడు పనితీరును మెరుగుపరచడానికి, వయసు పెరిగే కొద్దీ ఆరోగ్యకరమైన రక్త నాళాలను నిర్వహించడానికి ఇది చాలా అవసరం. నారింజ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉన్నందున, వాటిని తినడం వల్ల విటమిన్ సి రోజువారీ అవసరాన్ని కూడా తీరుస్తుంది. అంతేకాకుండా, మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**నారింజ తినడం వల్ల కలిగే ఇతర ప్రయోజనాలు**

నారింజ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి. ఇంకా, నారింజ పండ్లను తినడం వల్ల మొటిమలకు చికిత్స చేయడంలో, మచ్చలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఫలితంగా చర్మం స్పష్టంగా, ప్రకాశవంతంగా ఉంటుంది .

నారింజ పండ్లు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. క్రమం తప్పకుండా తినడం వల్ల కాలానుగుణ ఫ్లూ, బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది.

నారింజ పండ్లను గుండె ఆరోగ్యానికి మంచి పండుగా పరిగణిస్తారు. నారింజ పండ్లలోని పొటాషియం, ఫైబర్ గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.

రోజూ నారింజ పండ్లు తినడం వల్ల ఎముకలు బలపడతాయి. నారింజ పండ్లలో విటమిన్ సి, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకలను ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడతాయి.

# కాల్షియం లోపం.. ఈ లక్షణాలతో జాగ్రత్త.!

శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కాల్షియం చాలా అవసరం. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అన్ని వయసుల వారికి కాల్షియం చాలా అవసరం. బలమైన ఎముకలను నిర్మించడం, గుండెతో సహా కండరాల సంకోచాలను నియంత్రించడం, బలమైన దంతాలు కలిగి ఉండటం లేదా ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడం వంటి వాటికి కాల్షియం చాలా ముఖ్యం. తేలికపాటి కాల్షియం లోపం అలసట లేదా అసౌకర్యాన్ని కలిగించవచ్చు. దీర్ఘకాలిక, తీవ్రమైన లోపాలు గుండె సమస్యలకు దారితీయవచ్చు. కాల్షియం స్థాయిలు పడిపోయినప్పుడు ఈ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయని నిపుణులు అంటున్నారు..

**తిమ్మిర్లు:**

కండరాల నొప్పి, కదలిక సమయంలో తొడలు, చేతుల్లో నొప్పి కలుగుతుంది. ఇందులో చేతులు, పాదాలు, కాలి వేళ్లలో తిమ్మిరి, జలదరింపు కూడా ఉండవచ్చు. కండరాల పనితీరుకు కాల్షియం చాలా ముఖ్యమైనది. కాల్షియం స్థాయిలు తక్కువగా ఉంటే, కండరాలు సరిగ్గా పనిచేయవని నిపుణులు అంటున్నారు.

**అలసిపోయినట్లు అనిపించడం:**

తక్కువ కాల్షియం స్థాయిలు తీవ్రమైన అలసటకు కారణమవుతాయి. ఇందులో శక్తి లేకపోవడం, నీరసం వంటి భావన కూడా ఉంటుంది. ఇది నిద్రలేమికి కూడా దారితీస్తుంది. కాల్షియం లోపం వల్ల తల తిరగడం, మతిమరుపు, గందరగోళం వంటి ప్రమాదం కూడా పెరుగుతుంది.

**పెళుసైన గోర్లు:**

గోళ్లను ఉపయోగించి కాల్షియం స్థాయిలను గుర్తించవచ్చని నిపుణులు అంటున్నారు. శరీరంలో కాల్షియం లేకపోతే, గోళ్లు పెళుసుగా మారుతాయని, గోళ్ల చివరలు విరిగిపోతాయని చెబుతారు.

**దంతక్షయం :**

కాల్షియం పంటి ఎనామిల్‌లో ఒక ముఖ్యమైన భాగం. ఇది ఎనామిల్‌ను రక్షిస్తుంది. తగినంత కాల్షియం లేకపోతే, ఎనామిల్ బలహీనపడుతుందని, దంతక్షయం వంటి సమస్యలకు దారితీస్తుంది. కాల్షియం లోపం వల్ల జుట్టు విరిగిపోయి ముక్కలుగా రాలిపోతుంది. తామర, చర్మం వాపు, దురద లేదా పొడి మచ్చలు సంభవించవచ్చు.

**ఆర్థరైటిస్:**

బలమైన, ఆరోగ్యకరమైన ఎముకలకు కాల్షియం చాలా ముఖ్యమైనది. దీర్ఘకాలిక కాల్షియం లోపం ఎముకలను బలహీనపరుస్తుందని, ఆర్థరైటిస్ వంటి పరిస్థితులకు దారితీస్తుందని చెబుతారు.

**కాల్షియం కోసం ఏం తినాలి?**

కాల్షియం పొందడానికి మీరు ప్రతిరోజూ కొన్ని ఆహారాలు తినాలని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా పాలు, పెరుగు, జున్ను, సలాడ్, కాలే వంటి ఆకుపచ్చ కూరగాయలు తీసుకోవాలి. బాదం, సోయా ఉత్పత్తులు, టోఫు, జున్ను కూడా తీసుకోవచ్చు. సాల్మన్, సార్డిన్ వంటి చేపలను కూడా తినాలని నిపుణులు సూచిస్తున్నారు.



# డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్ తినవచ్చా?



డయాబెటిస్ పేషెంట్స్ తమ ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. తీపి పదార్థాలు అస్సలు తీసుకోకూడదు. ఎందుకంటే, దీని వల్ల ఆరోగ్యం మరింత దిగజారిపోతుంది. శీతాకాలంలో చాలా మంది స్వీట్ కార్న్‌ను తినడానికి ఇష్టపడతారు. కానీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు దీనిని తినడం ఆరోగ్యానికి మంచిదేనా? స్వీట్ కార్న్ తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

**డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్ తినవచ్చా?**

శీతాకాలంలో, చాలా మంది స్వీట్ కార్న్‌ను ఉడికించి ఉప్పు, కారం వేసుకుని తింటారు. కొంతమంది దీనిని సలాడ్‌లు, కూరగాయలలో కూడా ఉపయోగిస్తారు. ఇది ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరంగా ఉంటుందో అంతే రుచికరంగా ఉంటుంది. స్వీట్ కార్న్‌లో ఇనుము, జింక్, రాగి, మాంగనీస్, సెలీనియం, విటమిన్ సి, విటమిన్లు బి1, బి2, బి3, బి6, ఎ2 వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ పోషకాలన్నీ అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. శరీర పోషక అవసరాలను తీర్చడంలో సహాయపడతాయి.

ఆరోగ్య నిపుణుల ప్రకారం, డయాబెటిస్ పేషెంట్స్ స్వీట్ కార్న్‌ను మితంగా తినవచ్చు. ఎందుకంటే ఇందులో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. అయితే, దీనిని ఉడికించిన లేదా కాల్చిన ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలతో మితంగా తినాలని నిపుణులు సూచిస్తున్నారు.

స్వీట్ కార్న్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెరలో ఆకస్మిక పెరుగుదలను నివారిస్తుంది. ఇది శక్తికి మంచి మూలం. బి విటమిన్లు, మెగ్నీషియం, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు జీవక్రియను నియంత్రించడంలో సహాయపడతాయి. ఉడికించిన మొక్కజొన్నలో గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.